

ప్రజాదర్బార్‌లో వినతులను స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో 256 దరఖాస్తులు వచ్చాయని అధికారులు అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు ప్రజా అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నేడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 256 అర్జీలు రాగా అందులో ఎక్కువగా భూసమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెవెన్యూ అధికారులు భూసమస్యలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి నియోజకవర్గంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పింఛన్లు వందశాతం పూర్తి చేయాలి

● 1న సీఎం చంద్రబాబు పర్యటన : కలెక్టర్ శ్రీధర్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1న జిల్లాలో వందశాతం సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ హాలు నుంచి జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయచోటిలో పర్యటించే అవకాశం ఉందని, ఈ సందర్భంగా సామాజిక పింఛన్ల పంపిణీతో పాటు ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న సామూహిక గృహ ప్రవేశాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉండాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని చెప్పారు. జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని తెలిపారు. పింఛను పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయవద్దని తెలిపారు. పేదవారికి అత్యంత అవసరం ఉన్న వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమమని, ఎవరైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పింఛను పంపిణీలో అన్నమయ్య జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని చెప్పారు. అదేవిధంగా గృహ నిర్మాణాల లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు వెంకటరత్నం, సత్యనారాయణ, శివయ్య, సర్వేశాఖ ఏడీ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయం ఘటనపై కొరడా

● సర్వీసు నుంచి ప్రిన్సిపాల్, ఏఎన్ఎంల తొలగింపు

ములకలచెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీలో బయటపడ్డ విస్తుపోయే నిజాలపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఏఎన్ఎంలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేడినీళ్ల స్నానానికి ప్రతి విద్యార్థిని నుంచి రూ.100 వసూలు చేయడం, పిల్లల చేత కాళ్లు నొక్కించుకోవడం, పాత్రలు శుభ్రం చేయించడం, కసువు ఊడిపించడం, అన్నంలో పురుగులు వస్తున్నాయంటే తిట్టడం, వేధించడం వంటివి, పరీక్షల్లో మార్కులు తక్కువ వేస్తామని బెదరించడం, అనారోగ్యానికి గురైతే కాలం చెల్లిన మందులు ఇవ్వడం తదితర విషయాలు బయటపడడం, వాటిని తల్లిదండ్రుల సమక్షంలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. దీనిపై సామాజిక తనిఖీ బృందం ద్వారా అందుకున్న సమాచారం, స్థానిక ఎంఈవో ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ శిల్ప, ఏఎన్ఎం అశ్వనిలను సర్వీసు నుంచి తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష


● చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు 6

ఫ్రీహోల్డ్ భూములకు బ్రేక్

● జగన్ సర్కారులో భూ దందాలపై విచారణ
● ప్రభుత్వ భూములు కట్టబెట్టిన అధికారుల గుట్టురట్టుకు యత్నాలు
● క్లీన్‌చిట్‌కు రెండు నెలల గడువు
● అప్పటి దాకా 76 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకే

కడప జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల చిక్కుముడి వ్యవహారం ఇప్పట్లో వీడేటట్లు లేదు. జగన్ సర్కారులో చోటుచేసుకున్న ఫ్రీహోల్డ్ భూముల అక్రమదందాలు తవ్వేకొద్దీ ఒక్కొక్కటిగా బయట పడుతుండడంతో అధికారులకు మైండ్ బ్లాక్ అవుతోంది. అప్పట్లో వైసీపీ నేతల కోసమే అన్నట్లుగా జారీ చేసిన లోపభూయిష్టమైన జీవో వైసీపీ నేతల దురాశకు కారణమని, పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను కాజేసే కుట్ర సాగిందనే విమర్శలు ఉన్నాయి.

కడప జిల్లాలో దాదాపు 76,275 ఎకరాల ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ఫ్రీహోల్డ్ భూములుగా గుర్తించారు. అందులో 9,004 ఎకరాల ప్రభుత్వ భూములకు ఫ్రీహోల్డ్ పేరుతో క్లీన్‌చిట్ ఇప్పించేందుకు అధికారం ముసుగులో పెద్ద కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో బద్వేలు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను వైసీపీ నేతలు మేనేజ్ చేసి అడ్డగోలు భూ దందాలకు తెరలేపిన విషయాలు బయటపడుతున్నాయి.



ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలోనూ హడావిడే..

కడప కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.36 లక్షల ఎకరాలు ఉండగా.. ఇందులో 70 వేల ఎకరాల వరకు నిషేధిత భూముల జాబితాలో పెట్టడం చూస్తే ప్రభుత్వ భూములను గోల్‌మాల్ చేసే కుట్ర ఏ స్థాయిలో జరిగిందో ఊహించవచ్చు. మళ్లీ ప్రభుత్వం మనదే అన్న ధీమాతో కొందరు వైసీపీ నేతలు, అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఫ్రీహోల్డ్ చేయడం, కడప పరిధిలో కొన్ని భూములను అసైన్డ్ చేయడం, చుక్కల భూములకు క్లీన్‌చిట్ ఇవ్వడం లాంటి కుట్రల్లో అందరూ భాగస్వాములే అనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తప్పుడు విధానాలకు తోడ్పాటు అందించడంలో జిల్లావ్యాప్తంగా కొందరు తహశీల్దార్ల పాత్ర కీలకంగా కనిపిస్తోంది. ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన భూ బాగోతం తేల్చే పనిలో చంద్రబాబు కూటమి సర్కారు కసరత్తు ముమ్మరం చేసింది. 6 నెలలుగా ప్రయత్నిస్తున్నా ఫ్రీహోల్డ్ భూముల లెక్కలు తేల్చలేకపోయింది. నిజమైన భూహక్కు దారుల జాబితాను పారదర్శకంగా ప్రకటించేందుకు సిద్ధమైంది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు ఫ్రీహోల్డ్ భూముల్లో ఇన్నాళ్లు జరిగిన అవకతవకలు తేల్చే పనిని అప్పగించారు. వ్యూహాత్మకంగా జీవో రాక ముందే పేదల నుంచి, ప్రభుత్వం నుంచి నయానో భయానో లాక్కున్న భూముల చిట్టా విప్పేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాను కూడా రంగంలోకి దించింది. పూర్తి స్థాయిలో పరిశీలన జరిగితే జగన్ సర్కారులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల గుట్టురట్టు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరో 2 నెలల పాటు ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా బ్రేక్‌వేస్తూ నిషేధిత జాబితా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ వచ్చీరాగానే రిజిస్ట్రేషన్లలో అక్రమాలు సాగాయి. అధికారపార్టీ నేతలు రిజిస్ట్రేషన్ అధికారు లను బెదిరించి అప్పట్లో ప్రభుత్వ భూములను అడ్డ గోలుగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు వచ్చాక స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆదేశాల మేరకు మైదుకూరులో అక్రమ రిజిస్ట్రేషన్లు నిగ్గుతేల్చేందుకు అప్పట్లో కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లును ప్రొసీడింగ్ అధికారిగా నియమించారు. దాదాపు 125 రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగాయని గుర్తించారు. వాటన్నింటినీ రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ల గోల్‌మాల్ వ్యవహారంలో అప్పటికే పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో ఎనీవేర్ రిజిస్ట్రేషను చేసిన మహిళా సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అంతేకాకుండా మైదుకూరులో ఫ్రీహోల్డ్ భూములపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన విచారణలో మైదుకూరు తహశీల్దారు కార్యాలయంలో 14 మంది సిబ్బందికి కలెక్టరేట్ అధికారులు నోటీసులు జారీచేసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని తప్పుడు అధికారులకు ముచ్చెమటలు పట్టించారు. ఇన్నాళ్లు పేదలను మభ్యపెట్టి ప్రభుత్వ భూములను చవకగా కొట్టేసిన పెద్దల భాగోతంతో పాటు అవినీతి అధికారుల చిట్టాలు మరో 2 నెలల్లో బట్టబయలు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

1-బీ, అడంగల్ ఉంటే చాలు.. ఫ్రీహోల్డ్‌కు క్లీన్ చిట్..!



20 ఏళ్ల దాటిన ప్రభుత్వ భూములకు ఫ్రీహోల్డ్ భూములుగా ప్రకటిస్తూ అప్పట్లో జగన్ సర్కార్ జీవో జారీ చేసింది. ఈ జీవోకు భూముల పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేదు. కేవలం 1-బీ, అడంగల్‌లో ఎవరి పేరు ఉంటే వారే భూములకు రారాజు అనే విధంగా ఉండడం వైసీపీ నేతలకు వరంగా మారింది. ఫ్రీహోల్డ్ భూముల జీవో రానున్న విషయం ముందే తెలుసుకోవడంతో.. వైసీపీ నేతల భూ అక్రమదందాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని చెప్పవచ్చు. రెవెన్యూలో లొసుగులను ఔపోశన పట్టిన తహశీల్దార్ల సాయంతో పేదల ఫ్రీహోల్డ్ భూముల జాబితా పక్కన పెట్టుకుని కమర్షియల్‌గా కోట్లు వచ్చే ఖరీదైన భూములను టార్గెట్ చేశారు. పేదలకు పదో, పరకో ఇచ్చి నయానో భయానో అగ్రిమెంట్లతో వేలాది ఎకరాలను జీవో రాక ముందే కొల్లగొట్టారనే విషయం అప్పట్లో హాట్ టాపిక్ అయింది. జీవో వచ్చీరాగానే వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్ నుంచి తప్పించి ప్రభుత్వానికి టోకరా కొట్టినట్లు తెలుస్తోంది. తహశీల్దార్ల సహకారంతో జిల్లాలో దాదాపు 9,004 ఎకరాల వరకు అక్రమంగా వైసీపీ నేతలు దోచుకున్నట్లు ఇప్పటికే తేలిందని సమాచారం. ఇదే నిజమైతే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల్లో జరిగిన తప్పొప్పులను లెక్కించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలుస్తోంది.

తెలుగు లోగిళ్లకు కల్యాణ శోభ


● రాబోయే ఐదు నెలలు ముహూర్తాల సందడి ● నేటి నుంచి మాఘమాసం ప్రారంభం



కలికిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో తెలుగు లోగిళ్లు కల్యాణ శోభను సంతరించుకోనున్నాయి. ఆ తరువాత ఫిబ్రవరి మొదలు జూన్ నెల వరకూ ప్రతి మాసంలోనూ అనుకూలమైన విధంగా ముహూర్తపు గడియలు అందుబాటులో ఉండనున్నాయి. గత సంవత్సరం ముహూర్తాలు తక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు అంతంతమాత్రంగానే జరిగాయి. అయితే నవంబరు నెలలో ఊపందుకున్నాయి. ఈ ఏడాది ఐదు నెలలపాటు ముహూర్తాలకు కొదవలేదని పండితులు చెపుతున్నారు. ఫిబ్రవరిలో ఏకంగా 12 రోజుల పాటు ఊపిరి సలపని ముహూర్తాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నిశ్చితార్థాలు పూర్తి చేసుకున్న వారు ఆహ్వానపత్రికల పంపకాలతో హడావిడి మొదలు పెట్టేశారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తదితర శుభకార్యాలతో ఎటు చూసినా సందడి నెలకొనబోతోంది. దివ్యమైన ముహూర్తాలకు ఈ ఏడాది కొదవలేదని పంచాంగకర్తలు చెబుతున్నారు. ఆ తరువాత మార్చిలో ఐదు రోజులు, ఏప్రిల్‌లో 9 రోజులు, మే నెలలో 7 రోజులు, జూన్‌లో నాలుగు రోజులపాటు శుభలగ్నాలకు కొదవ లేదని అంటున్నారు. శుభ ముహూర్తాల సందడి కారణంగా కల్యాణ మండపాలు, మంగళ వాయిద్యకారులు, అలంకరణకారులు, పూలు, బట్టలు, బంగారు వ్యాపారులు, పురోహితులకు కూడా పంట పండనుంది. రిటైల్, హోల్‌సేల్ కిరాణా వ్యాపారులకు చేతినిండా అమ్మకాలు సాగనున్నాయి. టెంట్ డెకరేషన్‌లు, క్యాటరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, బ్యూటీపార్లర్లు, ఫొటోగ్రాఫర్లు ఇలా ఒక్కరేమిటి అన్ని రంగాల్లో లావాదేవీలు ఊపందుకోనున్నాయి. ఏదేమైనా చాలా కాలం తరువాత వరుస ముహూర్తాలు రావడం, అనుకూలమైన గడియలు అందుబాటులో ఉండటం ఈ ఏడాది విశేషంగా చెబుతున్నారు.

1న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

● సంబేపల్లెలో లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ



రాయచోటి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయచోటి నియోజకవర్గానికి రానున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉండే వార్డులో జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పాల్గొనబోయే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు కృషి చేస్తున్నారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. పెన్షన్లను గత ప్రభుత్వం ఇస్తున్న దానికంటే.. భారీగా పెంచిన విషయం తెలిసిందే. అదే సమయంలో ప్రతి నెలా స్వయంగా ముఖ్యమంత్రే ఏదో ఒక జిల్లాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల చేతికి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో జరిగే పెన్షన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



● ప్రారంభమైన దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
● శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, క్రిష్ణమోహన్, సాయి, కృష్ణమూర్తి, తరుణ్ శాస్త్రోకంగా పఠించిన వేద మంత్రాల నడుమ ఉదయం 9-30 నుంచి 10-30 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణం అత్యంత భక్తిశ్రద్ధలతో గావించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. ధ్వజారోహణం తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. కాగా.. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్ బుధవారం దేవుని కడప శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, స్వామివారు ఊరేగింపుగా తిరుగాడే మాడవీధులను పరిశీలించారు. రథసప్తమి రోజున తీసుకోవాల్సిన కట్టుదిట్ట భద్రత గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కడప రాయుడిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై తిరుమలేశుడు

రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకూ ఏడుకొండలస్వామి దేవేరులతో కలిసి చంద్రప్రభ వాహనంపై తిరువీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు సాయంత్రం 6 గంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఆలయంలో అన్నమాచార్య కీర్తనలు కడు రమ్యంగా ఆలపించి భక్తులను ఆనందసాగరంలో తేలియాడేలా చేశారు. 7 గంటలకు హరికథ కార్యక్రమంతో భక్తులను అలరించారు. కోలాట బృందం కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

వసతులున్నా.. రోడ్లపైనే..

● వెలవెలబోతున్న రైతుబజార్
● రైతులు రాక.. వ్యాపారులు లేక...
● రూ.కోటి ప్రభుత్వ ధనం నిరుపయోగం

6



బ్లాక్ మెయిల్ చేయడం తగదు

● నిందితులను రక్షించడానికి నాపై బదిలీ తీర్మానం ● ఎంపీడీవో జవహర్‌బాబు



మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్‌బాబు

గాలివీడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తనపై గత 27వ తేదీ వైసీపీ నాయకులు అమానుషంగా దాడి చేసిన ఘటనలో వారందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారని, వారిని రక్షించేందుకు తనపై బదిలీ తీర్మానం చేసి బ్లాక్‌మెయిల్ చేయడం తగదని ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో తనపై దాడి జరిగితే సభ్యులు సానుభూతి చూపించాల్సిందిపోయి వేరే చోటుకు బదిలీ చేయాలంటూ ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి ప్రతిపాదన చేస్తే సభ్యులు ఎలా మద్దతు తెలుపుతారని ప్రశ్నించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తన కుమారుడిని కేసు నుంచి తప్పించడానికి ఎంపీపీ ఇలాంటి తీర్మానాన్ని తెరమీదకు తెచ్చారని ఆరోపించారు. ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న తనపై అసత్య ఆరోపణ చేస్తూ ఇబ్బందులు పెడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశాలను మండల సమావేశంలో చర్చించడం తగదని తాను ఎంపీటీసీ సభ్యులకు తెలియజేశానని పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వ్యక్తులను కాపాడడం కోసం ఇలాంటి తీర్మానాలు చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు.

పోలీసు పహారాలో ముగిసిన సమావేశం

పోలీసు పహారాలో ఉత్కంఠ నడుమ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అన్యాయంగా వైసీపీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిన ఎంపీడీవో జవహర్‌బాబును తక్షణమే బదిలీ చేయాలని ఎంపీపీ పద్మావతమ్మ అనుమతితో ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదించగా అందుకు సభ్యులు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. ఇదే విషయమై స్పందించిన ఎంపీడీవో జవహర్ బాబు కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించడం సరికాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనంతరం అభివృద్ధి, ప్రజా సమస్యలపై శాఖల వారీగా పురోగతిపై సభ్యులు ప్రశ్నించగా శాఖల వారీగా అధికారులు సమాధానమిచ్చారు. సమావేశానికి గైర్హాజరైన విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వాటర్ షెడ్, ఫారెస్ట్, ఎక్సైజ్, ఆర్టీసీ శాఖల అధికారులపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. గత నెలలో ఎంపీడీవోపై జరిగిన దాడి దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 6 మంది ఎస్ఐలు, 100 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతులున్నా.. రోడ్లపైనే...

- వెలవెలబోతున్న రైతుబజార్
- వసతులు అధునాతనం
- రైతులు రాక.. వ్యాపారులు లేక...
- రూ.కోటి ప్రభుత్వ ధనం నిరుపయోగం
- 50 గదులున్నా ఇద్దరే వ్యాపారులు
- మార్కెటింగ్‌శాఖ అధికారుల ప్రయత్నాలు విఫలం
- ఇదీ రాయచోటిలో రైతు బజార్ దుస్థితి

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ నడిబొడ్డులో బస్టాండుకు అత్యంత సమీపంలో రూ.కోటి నిధులతో నిర్మించిన రైతు బజార్‌కు రైతులు రాక, వ్యాపారాలు లేక వెలవెలబోతోంది. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన నూతన రైతు బజార్‌లో వ్యాపారులు సౌకర్యార్థం 50 గదులు ఏర్పాటు చేసినప్పటికీ కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే అక్కడ వ్యాపారాలు చేస్తుండడంతో కొనుగోలుదాడులు రాకపోవడమే కాకుండా పంటలు పండించే రైతులు సైతం తాము పండించే కూరగాయలను రైతుబజార్‌కు తీసుకురాకపోవడంతో అక్కడ కూరగాయలు విక్రయిస్తున్న ఒకరిద్దరు వ్యాపారులు కూడా రైతు బజారు ముందు భాగంలో ఆరుబయటనే వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు నివాసాల నిర్మాణాలతో పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం అధునాతన రైతు బజారు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయలు వెచ్చించి గాలివీడు మార్గం నుంచి బస్టాండుకు వచ్చే రోడ్డు పక్కనే నూతన రైతు బజారును నిర్మించారు. రైతు బజారు నిర్మాణం పూర్తయిన అనంతరం 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారును ప్రారంభించగా అప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు రైతు బజారు బాగానే నడిచినప్పటికీ సంవత్సర కాలంగా కొనుగోలుదారులతో పాటు పంటలు పండించే రైతులు రైతుబజారుకు సక్రమంగా రాకపోవడంతో వ్యాపారాలు రోజు రోజు తగ్గిపోతూ వచ్చాయి. దీంతో అక్కడ వ్యాపారం చేసుకునే వ్యాపారులు ఒక్కొక్కరిగా రైతు బజారు నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపైన వ్యాపారాలు పెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా మిగిలిన ఒకరిద్దరూ మాత్రం రైతు బజారు ముందు భాగంలోనే ఆరుబయట రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో కోటి రూపాయలతో 50 గదులతో పాటు నాలుగు స్టాక్ రూములతో నిర్మించిన రైతు బజారు వెలవెలబోతోంది.

దళారుల మాయలో రైతులు

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలు తమ పంటలను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతుబజార్‌ను నిర్మించింది. కానీ రైతులు మాత్రం ఇక్కడకు రాకుండా పాత మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొంతమంది దళారుల చేత మోసపోతూనే ఉన్నారు. రైతులు పండించి మార్కెట్‌కి తీసుకొస్తున్న టమోటాలు, పచ్చిమిరపకాయలు, బెండకాయలు, వంకాయలు తదతర కూరగాయలను దళారులు, వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు మాత్రం ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అధికారులు పదేపదే చెబుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైతు బజారులో పంటలను విక్రయించుకుని లబ్ధి పొందాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వాటిని పట్టించుకోకుండా దళారులను నమ్మి మోసపోతున్నారు.



రైతుబజారు బయట గేటు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

రోడ్డుపైనే విక్రయాలు...

రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కూరగాయల వ్యాపారులు రైతు బజారులో కాకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన, డ్రైనేజీ కాలువలపైన, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రైనేజీలు ఆక్రమిస్తే మాకేంటి.. రోడ్లపైన వ్యాపారాలు చేస్తే మాకేంటి అన్న చందంగా అటు మున్సిపల్ అధికారులు, ఇటు ట్రాఫిక్ అధికారులు వ్యవహరిస్తుండడంతో పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా కోటి రూపాయలతో నిర్మించిన రైతుబజారు అత్యంత సౌకర్యవంతంగా అందుబాటులో ఉన్నప్పటికీ కొంత మంది వ్యాపారులు మాత్రం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో, డీఈవో కార్యాలయం ముందు భాగంలో, వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో, సుండుపల్లె రోడ్డులోని డ్రైనేజీపై, మార్కెట్‌వీధిలో రోడ్లపైన ఇలా ఎక్కడపడితే అక్కడ కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారు. కొనుగోలుదారుల వాహనాలు, ఆటోలు ఇలా రోడ్లపైన నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై జరుగుతున్న కూరగాయల విక్రయాలను నియంత్రించి ఖాళీగా ఉన్న రైతు బజారులోకి వ్యాపారులను తరలించి వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



వీరభద్రస్వామి గుడి ఎదురుగా మార్కెట్‌లో రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు

వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం

రాయచోటి పట్టణంలో ఉన్న రైతు బజారును వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం. 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారు ప్రారంభించినప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు అక్కడ వ్యాపారాలు బాగానే జరిగాయి. ఇటీవల కాలంలో కొంతమంది రైతులు తాము పండించిన పంటలను అక్కడికి తీసుకురాకపోవడం, కొనుగోలుదారులు సరిగ్గా రాకపోవడంతో అక్కడ ఉంటున్న వ్యాపారులు గిట్టుబాటు కాలేదంటూ ఒక్కొక్కరే దూరమయ్యారు.

-నాగరాజు, ఏడీ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, రాయచోటి



రూ.కోటి నిధులతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజార్



రైతుబజార్‌లో అధునాతనంగా నిర్మించిన స్టాల్స్

వినియోగంలోకి తీసుకురావాలి



పట్టణ నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న రైతుబజారును వినియోగంలోకి తీసుకురావాలి. ఎంతోమంది రైతులు ఆరుగాలం కష్టపడి తాము పండించిన పంటలను దళారులు, వ్యాపారుల చేతిలో పెట్టి మోసపోతున్నారు. పట్టణంలోని వాహన దారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన జరుగుతున్న కూరగాయల వ్యాపారాలను రైతుబజారులోకి తీసుకొచ్చి కొనుగోలు దారులకు తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు లభించేలా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతు బజారులో రైతులకు, వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

-సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష

- చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో 2022 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో బుధవారం చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు 4 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీ బాలికను సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన కోటకొండ చరణ్, తిరుపతి పట్టణానికి చెందిన షేక్ హేమద్‌లు కిడ్నాప్ చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును దర్యాప్తు చేసిన మదనపల్లి టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారన్నారు. బుధవారం ఈ కేసు పూర్వాపరాలను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితులకు చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి నిందితులకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్షపడటంలో కృషి చేసిన స్పెషల్ పీపీ శైలజ, మదనపల్లి డీఎస్పీ కొండయ్యనాయుడు, మదనపల్లె టూటౌన్ సీఐ కె.రామచంద్ర, దర్యాప్తు అధికారి, ఎస్‌ఐ చంద్రమోహన్, మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌కే రహీముల్లా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ హరిబాబునాయక్, చిత్తూరు కోర్టు లైజర్ హెడ్ కానిస్టేబుల్, టీసీ సాయి సుధాకర్‌లను ఎస్పీ అభినందించారు.

బోర్డులు తొలగిస్తే కేసులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నాటిన బోర్డులు తొలగించిన వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లె, జగనన్న కాలనీ ఎదురుగా సర్వే నెంబర్ 2574-3లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం పేరిట నాటిన బోర్డు భూకబ్జాదారులు తొలగించారని కథనం రావడంతో ఆ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బోర్డు తొలగించిన ప్రదేశంలో ఇది ప్రభుత్వ స్థలం, ఇందులోకి అనుమతిలేకుండా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని తిరిగి బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో మట్టి తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో సంతోశ్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగంధం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, దుంగలతో ఫారెస్టు సిబ్బంది

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా 43 కేజీల శ్రీగంధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ బుధవారం తెలిపారు. శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము మంగళవారం రాత్రి చిత్తూరు జిల్లా కల్లూరులో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు.

రాత్రి 11 గంటల ప్రాంతంలో పీలేరు వైపు నుంచి వచ్చిన టీఎన్-23 బీఈ 5179 నెంబరు గల ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు తాము ఆపినా ఆపకుండా సదుం వైపు వెళ్లిందన్నారు. ఆ కారును తాము వెంబడించగా అందులోని వ్యక్తి దానిని కల్లూరు ఎగువవీధి వద్ద ఆపి పారిపోయాడన్నారు. కారును తనిఖీ చేయగా 3 బస్తాలలో 43 కేజీలు బరువున్న శ్రీగంధం లభ్యమైందన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో తనతో పాటు ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది నందీశ్వరులు, సురేశ్ రాజు, సుబ్రహ్మణ్యం, చరణ్ పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

591 కల్తీ మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీగా కల్తీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. అనంతరాజుపేటకు చెందిన ఎం.అయ్యప్ప, ఓబులవారిపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన వెంకటనారాయణ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించి 591 కల్తీ మద్యం సీసాలు, రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసులో ప్రధాన నిందితులైన తిరుపతివాసులు ఆర్.వెంకటరమణ, జయబాబు పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నామన్నారు. దాడుల్లో సీఐ ఎల్లయ్య, నీలకంఠేశ్వరరెడ్డి, తులసి, ఎస్‌ఐలు శశిధర్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ : ఒకరి మృతి

ఓబులవారిపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడపకు చెందిన రుద్రరాజు సుబ్రమణ్యం రాజు (46), అనంతరాజుపేటకు చెందిన రెడ్డెయ్యతో కలిసి బుధవారం రాత్రి కారులో కొర్లకుంట నుంచి కోడూరు వైపు వెళుతుండగా మండలంలోని మంగంపేట సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి గుడి సమీపంలో చెన్నై నుంచి పూణె వెళుతున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న సుబ్రమణ్యంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రెడ్డయ్యకు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి తిరుపతికి తరలించినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.ఈ సమాచారం తెలియడంతో ఎమ్మెల్యే శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.



కంటైనర్‌ను ఢీకొన్న కారు. కారులోనే మృతి చెందిన సుబ్రమణ్యంరాజు

డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు...

- కురబలకోటలో రెవెన్యూ లీల

కురబలకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు ఆ పార్టీకి చెందిన నేతలకు ఇష్టానుసారంగా డీకేటీ భూములను అప్పనంగా రాసిచ్చేశారు. కురబలకోటలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు పేదలకు చేయాల్సిన పనులు ఏమాత్రం చేయరు కానీ...ఫైసలిస్తే మాత్రం చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ భూముల్లో వ్యవసాయం చేసుకోవాలి. ఈ భూమి వారసత్వంగా తమ కుటుంబీకులకు సంక్రమిస్తుంది తప్ప ఇతరులెవ్వరికీ సంక్రమించదు. అంతేకాకుండా వంశపారపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు, ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా చేయకూడదు. కానీ చాలాచోట్ల 99 ఏళ్ల శాశ్వత కొనుగోళ్ల పేరుతో క్రయ, విక్రయాలు చేపట్టి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ తంతు చట్ట ప్రకారం చెల్లుబాటు కావన్న విషయం బహిర్గతమే. అయితే చట్టప్రకారం ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు.

కానీ ఇక్కడ పనిచేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఏమాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు. ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. భూముల ధరలు ఆకాశాన్నంటాయి.

కడప-మదనపల్లె రహదారిలోని తానామిట్ట వద్ద సర్వే నెంబర్ 1630లోని భూమి గత ప్రభుత్వ హయాంలో ఇసుక నిల్వలు చేయడానికి వినియోగించారు. అయితే ఈ భూమికి మహమ్మద్ అఫ్రిది పేరుతో 2159 ఖాతా నెంబర్‌లో విస్తీర్ణం 4 ఎకరాల భూమిని, ఇదే సర్వే నెంబర్‌లోని భూమిని శరీనాబీ పేరుతో 2198 ఖాతా నెంబర్ 25 సెంట్ల భూమిని అనువంశికం ద్వారా సంక్రమించినట్లు వన్‌బీ అడంగల్ హక్కును రెవెన్యూ అధికారులు కల్పించారు.



ముదివేడు సమీపంలోని తానా మిట్ట వద్ద భూమి

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు

ఈ భూములకు సంబంధించి గతంలో ఏమి జరిగిందో నాకు తెలియదు. ఎవరు పాసుపుస్తకాలు మంజూరు చేశారో నాకు తెలియదు. ఈ భూమికి సంబంధించిన విషయం నా దృష్టికి రాలేదు. ఒకవేళ వీటికి సంబంధించి ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాము.

- తపస్విని, తహసీల్దార్

పాడి రైతుల సమగ్రాభివృద్ధే 'హెరిటేజ్' లక్ష్యం

- పాడి రైతుల మహాసదస్సులో నారా భువనేశ్వరి

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉత్పత్తులు, వినియోగదారుల సంతృప్తి, పాడి రైతుల సమగ్రాభివృద్ధే తమ సంస్థ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరులోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం జరిగిన పాడి రైతుల మహా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న చిత్తూరు జిల్లా పాడి రైతుల ఆదాయాన్ని పెంచి వారికి సుస్థిర అభివృద్ధిని కలగజేసేందుకు 32 ఏళ్ల క్రితం హెరిటేజ్ సంస్థను ప్రారంభించామన్నారు. ఏనాడూ రైతులకు ఆలస్యంగా చెల్లింపులు చేసిన దాఖలాలు లేవన్నారు. నేడు తమ సంస్థ ద్వారా దేశంలోని 9 రాష్ట్రాల్లో రోజుకు 9 వేల గ్రామాల నుంచి 200 చిల్లింగ్ యూనిట్ల ద్వారా 3 లక్షల మంది రైతుల దగ్గర నుంచి 18.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామన్నారు. 12 రాష్ట్రాల్లో తమ అమ్మకాలు సాగుతున్నాయన్నారు. డ్వాక్రా సంఘాల తరహాలో హెరిటేజ్ సంస్థలోనూ మహిళా పాడి రైతుల గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి విరివిగా రుణాలు అందిస్తున్నామన్నారు. కేవలం పాల సేకరణతోనే సరిపెట్టకుండా అటు పాడికి, ఇటు రైతులకు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నాణ్యమైన పాడి ద్వారానే నాణ్యమైన పాలు సాధ్యమని నమ్మి పశుసంవర్ధక సేవలు కూడా అందిస్తున్నామన్నారు. గడిచిన ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వేయి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 12 వేల ఆవులకు ఉచితంగా వైద్యం అందించామన్నారు. హెరిటేజ్ ఫిన్‌లీస్ లిమిటెడ్ ద్వారా రైతులకు వారి పాల సరఫరా ఆధారంగా సాధారణ, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నామని, గత ఏడాది తమ సంస్థ ద్వారా రూ.139.11 కోట్ల రుణాలు అందజేయగా అందులో చిత్తూరు జిల్లా రైతులకు రూ.16.12 అందజేశామన్నారు. హెరిటేజ్ వెట్ అనే యూట్యూబ్ చానెల్ ద్వారా పశువుల ఆరోగ్యం, వ్యాధి నివారణ-నిర్ధారణ, సైలేజ్ తయారీ, శుభ్రమైన పాల ఉత్పత్తి పద్ధతులపై విలువైన సమాచారాన్ని రైతులకు అందజేస్తున్నామన్నారు.

పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను ప్రోత్సహించడానికి అమెరికాకు చెందిన 'టెక్నో సెర్వ్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నామని, ఆ సంస్థ భాగస్వామ్యంతో పశు, రైతుల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఆమె సమక్షంలో హెరిటేజ్, టెక్నో సెర్వ్ సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఆమె రూ.183.5 లక్షల రుణ చెక్కును పాడి రైతులకు అందజేశారు. పలు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల కుటుంబాలకు రూ.21.45 లక్షల చెక్కులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది మహిళా ఏజెంట్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సీవోవో సాంబమూర్తి, పాలసేకరణ విభాగం అధిపతి రామ్మోహన్ రావు, హెరిటేజ్ సంస్థ ఉన్నతాధికారులు గోపాలకృష్ణ, సర్వోత్తమ రెడ్డి, దామోదర్ నాయుడు, 'టెక్నో సెర్వ్' సంస్థ ప్రతినిధులు జయదీప్ దత్తా, వీఎన్ రామకృష్ణ, చంద్రశేఖర రావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం వేంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సెల్వరాజ్ పాల్గొన్నారు.



ప్రమాద బాధితులకు బీమా చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

తగ్గేదేలే...



- బద్వేలులో జోరుగా గంజాయి విక్రయాలు
- నెల్లూరు- ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి దిగుమతి
- నియోజకవర్గ వ్యాప్తంగా సరఫరా
- నామమాత్రంగా పోలీసు దాడులు

బద్వేలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది గ్యాంగ్‌లా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడకు గంజాయి తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ గంజాయి దొరుకుతుండటంతో యువత బానిసలుగా మారుతున్నారు. కొందరు కూలీనాలీ చేసుకునే వారు గంజాయి పీల్చుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

గత జగన్ ప్రభుత్వంలో గంజాయి మాఫియా రాజ్యమేలందంటారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు తమ ప్రభుత్వం ఏర్పాటు అయితే గంజాయి మాఫియా భరతం పడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు అయినా ఆచరణలో అమలు కాలేదు. ఇక పోలీసులు మాత్రం నామమాత్రపు దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటు న్నారు. దీంతో గంజాయి గ్యాంగ్ తగ్గేదేలేదు అన్నట్లు జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా సరఫరా

గంజాయి విక్రయాలు చేస్తున్న ఐదారుగురు బద్వేలు పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. వీరు నెల్లూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాల నుంచి పెద్ద ఎత్తున బద్వేలుకు గంజాయి తీసుకు వచ్చి ఇక్కడ విక్రయించడంతోపాటు వారికున్న పరిచయాల ద్వారా నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా వీరంతా గంజాయి వ్యాపారం సాగిస్తూ వచ్చారు. వీరిలో ఇప్పుడు ఒకరిద్దరు లేకపోయినా మిగతావారు ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. బద్వేలు పట్టణంలోని శివాలయం పరిసర ప్రాంతాలలో గల చెట్లచాటున, మార్కెట్‌యార్డు ప్రాంతంలో, పోరుమామిళ్ల రోడ్డులోని మరో ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి పెద్ద మొత్తంలో బద్వేలుకు తెచ్చి పట్టణంలోని పలుచోట్ల వారి మనుషుల ద్వారా విక్రయించడం, లేదా నేరుగా వారే విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు కేజీలు, అరకేజీలు లెక్కన పంపిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

గంజాయి విక్రయాలకు సంబంధించి నాలుగు రోజుల క్రితం ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యక్తి ద్వారా గంజాయి వ్యాపారానికి సంబంధించిన కూపీ లాగుతున్నట్లు సమాచారం. బద్వేలు కేంద్రంగా ఎంతమంది వ్యాపారాలు సాగిస్తున్నారు.. ఎక్కడికి సరఫరా చేస్తున్నారు.. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే విషయాలపై ఆరా తీయడంతో పాటు గంజాయి విక్రేతలపై నిఘా ఉంచినట్లు సమాచారం.

మత్తులో యువత

గంజాయి యథేచ్ఛగా దొరుకుతుండడంతో కొందరు యువత బానిస లుగా మారుతున్నారు. వీరితోపాటు కూలీనాలి చేసుకునే కొందరు బానిసలై గంజాయి మత్తులో తూలుతున్నారు. గంజాయిని పొడిచేసి సిగరెట్‌లో ఉండే పొగాకు తొలగించి గంజాయిపొడి వేసి పీల్చుతారు. ఇంకొందరు చిన్న చిన్న ప్లాస్టిక్ సీసాలలో కూడా గంజాయికూర్చి వాటిద్వారా సేవిస్తున్నారు. దీంతో వీరంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్‌శాఖాధికారులు ప్రత్యేక దృష్టితో సారించి గంజాయి విక్రయాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై బద్వేలు సీఐ రాజగోపాల్‌ను వివరణ కోరగా.. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయంలో ఈడీ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన వేతనాల ప్రకారం కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. అందించే వేతనాల్లో భారీ వ్యత్యాసాలున్నాయన్నారు. కావున కాంట్రాక్టర్ల ద్వారా అందే వేతనాలు సక్ర మంగా అందేలా చూడాలన్నారు. లేబర్ కమిషనర్ ఇచ్చిన ప్రకారం కార్మికులకు రావలసిన సెలవులు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు ఈఎస్ఐ కార్డులు కాంట్రాక్టర్ ద్వారా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్, స్టీఫెన్‌ఆంథోని, శ్రీనివాసులు, శివశంకర్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హనుమంతు

కాశినాయన జనవరి 29 (ఆంధ్రజ్యోతి) బి.మఠం మండలం తోట్లపల్లె వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు తెలుగంగ ఎడమ కాలువలో పడిన రామయ్య అనే వ్యక్తి బుధవారం అంబవరం వద్ద శవమై కన్పించినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలీ మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి రామయ్య భార్య భర్తలు. వీరికి పిల్లలు లేరు. గత 20 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల నుంచి మఠం మండలం తోట్ల పల్లి సమీపంలోని అచలానంద ఆశ్రమంలో ఉంటున్నారు. మంగళవారం ఇరువురు కలిసి తెలుగంగ కాలువ వద్ద బట్టలు ఉతుక్కుంటుండగా ప్రమాదవశాత్తు రామయ్య కాలువలో జారి పడి.. నీటిలో కొట్టుకొచ్చి బుధవారం అంబవరం వద్ద కాలువలో శవమై కన్పించాడు. అతని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

- అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ



మాట్లాడుతున్న అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ

వేముల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అన్నారు. బుధవారం వేముల సభాభవనంలో గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ, అవగాహన కార్యక్రమం చేస్తున్న విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ వీఎస్‌పీ శివరామకృష్ణ, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, నాబార్డు డీడీఎం విహారి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, అరటి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ, కదిరి బాబు రావు కళాశాల టీచింగ్ అసోసియేట్ అఖిల్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అరటి పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు వివ రించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ చీనీ పంటలో బెలుకును ఎక్కువగా వాడకూడదని, నీటిని తగిన మోతాదులో పెట్టాలన్నారు. నాబార్డు డీడీఎం విహారి, శాస్త్రవేత్త రేష్మ మాట్లాడారు.

రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ప్రవీణ్‌కుమార్



కడప రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ బుధవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఆయన కడప కోర్టులో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. గతంలో జిల్లా న్యాయసేవాధికరా సంస్థ సెక్రటరీగా, సీనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడే పనిచేశారు. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలం పెట్టించడంలో కృషి చేశారు.

క్రీడా పోటీల్లో పశువైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థి సాయి తేజశ్విని క్రీడల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించిందని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో కళాశాల బాలికల జట్టు విజేతగా నిలిచిందన్నారు. బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. బాలుర క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. సాంస్కృతిక విభాగంలో వివిధ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని తెలిపారు. నృత్యం, జానపద నృత్య ప్రదర్శనలలో సాహిత్య విభాగంలో పశువైద్య విద్యార్థులు బహుమతులను దక్కించుకున్నారని, క్విజ్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన 105 మంది విద్యార్థులను అభినందించారు. పశువైద్యులు హరిప్రియ, కల్యాణి, ఇందిర, చరిత, రాజకిశోర్, కల్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై విద్యుత్ దీపాల వెలుగులు



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న కొండాపురం పట్టణం

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పుణ్యమా అని కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. కొండాపురం పట్టణం గుండా వెళ్లే నేషన్ హైవే (ఎన్‌హెచ్-67) రహదారిపై మంగళవారం విద్యుత్ దీపాలను వెలిగించారు. ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవే పనుల్లో భాగంగా కొండాపురం పట్టణంలో విద్యుత్ దీపాలను అమర్చారు. రోడ్డుకు ఇరువైపులా 128 లైట్లను అమర్చారు. వీటిని మంగళవారం రాత్రి హైవే అధికారులు ప్రారంభించడంతో కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో వెలిగిపోతోంది.

ఆకతాయిల నిప్పు... 200 మామిడి చెట్లు దగ్ధం

- రూ.10లక్షలు నష్టం



కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణ శివారు పరిధి బుగ్గవంక సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 200 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. బాధితుల వివరాల మేరకు.. సీకేదిన్నె మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ బుగ్గలపల్లెలోని తుమ్మలకుంట మహాలక్ష్మి, శివక్రిష్ణ, నాగలక్ష్మి, ఈశ్వర్‌లకు సంబంధించి సుమారు ఐదెకరాల పరిధిలో ఉన్న 200 మామిడి చెట్లు ఓ ఆకతాయి సిగరెట్ తాగి పారేయడంతో కాలిపోయాయి. ఘటనలో డ్రిప్ పరికరాలు, పైపులు పూర్తిగా పాడయ్యాయి. మామిడి చెట్లు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ స్థితిలో మామిడిచెట్లు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యాన అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి తమను ఆదుకోవాలని వారు కోరారు.

ముగ్గురు మట్కాబీటర్లు అరెస్టు

వల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గణేశ్‌పురం సమీపంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ తెలి పారు. మట్కా ఆడుతున్నారన్న సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి దాడులు చేసి గణేశ్‌పురంలో మూతబడిన పెట్రోలు బంకు వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.50,420 నగదు స్వాధీనం చేసుకొని పట్టుబడిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హాకీలో కడపకు ద్వితీయ స్థానం

- ముగిసిన ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన కడప జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్‌ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతల కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు హనీష్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్‌సొహుల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్జీఆర్ సర్కిల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాల కోసం అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ, సామాజిక వర్గాలకు చెందిన అర్హులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు.

ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. దరఖా స్తు ప్రక్రియ ముగిసిన వెంటనే స్థానిక ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తిస్తామన్నారు. మార్చి 9వ తేదీలోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవుతుందని వివరించారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం ఎప్పుడో...!

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- ప్రయాణికులు, స్థానిక ప్రజల ఇక్కట్లు

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ ప్రారం భం కోసం ప్రయాణీకులు ఎదురుచూపులు చూస్తున్నారు. బస్టాండ్ నిర్మాణం పూర్తై మూడు నెలలు గడస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బం దులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

వేంపల్లె పట్టణం చుట్టుపక్కల ఐదు మండలాలకు ప్రధాన కేంద్రం. అలాగే కడప, పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు పట్టణాలకు వేంపల్లె ద్వారా నిత్యం బస్సులు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో గత ప్రభుత్వంలో ప్రయాణీకుల సౌకర్యార్థం సుమారు రూ.2.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల సమ యంలో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇక్కడి టీడీపీ నాయకుల విన్నపం మేరకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలు రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. బస్టాండ్ పూర్తయి దాదాపు మూడు నెలలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస్టాం డ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే బస్సులు నిలుపు తుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఇక కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లను నిర్మించినప్ప టికీ అవి తెరకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. పూర్తైన బస్టాండ్‌ను త్వరగా ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఆదిశగా అధికారపార్టీ నాయ కులు, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.



వేంపల్లెలో పూర్తైన ఆర్టీసీ బస్టాండ్

ఫర్నీచర్ కోసమే జాప్యం

కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయింది. అయితే బస్టాండ్‌లో ప్రయా ణికులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్ అందు బాటులో లేదు. ఈవిషయం ఆలస్యంగా గుర్తించిన ఆర్టీసీ అధికారులు ఫర్నీచర్ కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. టెండర్ ద్వారా ఈ ఫర్నీచర్‌ను సమకూర్చుకోవాల్సి ఉంది. దీని కోసం బస్టాండ్ ప్రారంభా నికి ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.



ప్రారంభానికి నోచుకోకపోవడంతో బస్సుల రాకపోకలు లేక నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్



ఫర్నీచర్ లేక ఖాళీగా ఉన్న బస్టాండ్ లోపలి భాగం

సమస్య ఆర్ఎం దృష్టికి...

వేంపల్లెలో బస్టాండ్ నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోని విషయం ఆర్ఎం గోపాల్‌రెడ్డి దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా.. రూ.3లక్షల ఫర్నీచర్ కోసం ఉన్నతాధికారులకు కొటేషన్ పంపాం. త్వరలోనే ఫర్నీచర్‌ను బస్టాండ్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చి మంత్రి ద్వారా బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆటోలకు పోలీసు నంబర్ తప్పనిసరి

రామాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిరుగుతున్న ఆటోలు పోలీస్ నంబర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుగుతున్న ఆటోలకు నంబర్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబర్లు వేసిన ఆటోలన్నింటి సమాచారం పోలీస్ స్టేషన్‌లో ఉంటుందన్నారు. పోలీస్ నెంబర్ లేని ఆటో పట్టుబడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

నేడు డ్రైవర్లకు కంటి పరీక్షలు

రాజంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయనపల్లె మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు డ్రైవర్లకు ఎ. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోటారు వాహనాల తనిఖీ అధికారి బి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్లందరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్పీకి సన్మానం

సిద్దవటం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.అశోక్‌కుమార్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు ఎవరినీ నియమించలేదని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

రాయచోటి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● విలేకరుల సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చిన్నమండెం:మంత్రికి వినతి పత్రం అందిస్తున్న జయవర్ధన్

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన రాయచోటి నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి మండిపల్లి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. హంద్రీ -నీవా ప్రాజెక్టు ద్వారా శ్రీనివాస పురం రిజర్వాయర్‌కు సాగునీరు అందించేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. 78 ఏళ్లగా మరమ్మతులకు నోచుకోని 14 హాస్టళ్ల మరమ్మతులకు 4 కోట్లు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలకు జల్‌జీవన్ మిషన్ అమృతధార పథకం కింద శాశ్వతంగా తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో ఐదు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, పాలకవర్గంలోని వైసీపీ కౌన్సిలర్లు, వారి నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ నిధులు కేటాయించినా పలువురు సర్పంచులు నిధులు దుర్వినియోగం చేసినట్లు తమ దృష్టికి వచ్చిం దన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇప్పటికే వృద్ధులకు రూ. 4 వేలు పింఛన్ ఇస్తున్నామ న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది మహిళలు ఉచిత గ్యాస్ పొందుతు న్నారని తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు చెప్పారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

చిన్నమండెం: కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలంటూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ బుధవారం చిన్నమండెం మండలంలోని మంత్రి నివాసంలో మంత్రికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన రాయచోటికి చెందిన విద్యార్థులు నితిన్‌రెడ్డి, రాకేశ్‌ను మంత్రి అభినందించారు.

'కార్పొరేట్'కు దీటుగా వసతులు

రాయచోటిటౌన్ : రాయచోటిలోని ప్రభుత్వ కళాశాల 92వ వార్షికోత్సవాల్లో మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గజ మాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పాపాలు.. ప్రజలకు శాపాలు

● మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చేసిన తప్పులకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సి వస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భూకబ్జాలు, అక్రమాలు ఎక్కువయ్యాయని చెబుతుండగా, తమ పార్టీని విమర్శించవద్దని ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండలంలో అన్ని పంచాయతీల్లో ఇప్పటివరకు 480 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. శ్మశాన ప్రహరీ గోడ కూల్చినా, జాయింట్ కలెక్టర్ ఆదేశాలను పాటించకున్నా ఎటువంటి చర్యలు లేవని ఆరోపించారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. మండల సమావేశం తీర్మానాల మేరకు పనులు కేటాయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. గత మండల సభలో ఏ సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే మండల మీటింగ్‌లో ప్రస్తుత సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. శ్మశానం ప్రహరీ గోడ కూల్చివేసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు చర్యలు లేవని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పుల్లంపేట తహసీల్దారు అరవిందకిషోర్ మండల సమావేశాలకు హాజరు కాకపోవడంపై సభలో తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపుతామని ఎమ్మెల్యే కూడా తహసీల్దారుపై దృష్టి పెట్టి ప్రజలకు న్యాయం చేయాలని ఎంపీపీ కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధిపై వివరించారు.

రైతు సేవా కేంద్రాల్లో జేడీఏ తనిఖీలు



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రామాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి, చిట్లూరు రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ యాప్ ద్వారా పైర్లను ఆశించిన చీడపీడలు, తెగుళ్ల ఉధృతి నివా రణకు తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకోవచ్చునన్నారు. ఈ యాప్‌పై రైతులందరికీ అవగాహన కల్పించాలని, ఈ క్రాప్‌లో నమోదు చేసిన ప్రతి పంటకు, రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఆదేశించారు. అనంతరం చిట్లూరు గ్రామంలోని కంది పైరును పరిశీలించి దిగుబడిని అంచనా వేసి రైతులకు సలహాలిచ్చారు. ఈ కార్యక్ర మంలో లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో సుగవాసి భేటీ



పల్లా శ్రీనివాసరావుతో సుగవాసి

రాజంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాజంపేట నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజంపేటలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. వాటిని పరిష్కరించడంలో రాష్ట్ర అధ్యక్షుడు సానుకూలంగా స్పందించాడని సుగవాసి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించినట్లు తెలిపారు.

కస్తూరిబా పాఠశాలలను తనిఖీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రైల్వేకోడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కస్తూరిబా పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీలు నిర్వహించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దీవెన కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. కస్తూరిబా పాఠశాలల విద్యార్థినులకు వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్వయంగా కస్తూరిబా పాఠశాలలను తనిఖీ చేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కేపేంద్ర, గోవర్ధన్, నరసింహ, మల్లి, మహిమరాజ్, వంశీ, ఆదిత్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రైల్వేకోడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య తెలిపారు. బుధవారం రైల్వేకోడూరులోని గాంధీ విగ్రహం వద్ద ఏప్రిల్ 1 నుంచి అమలు చేయదలచిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయదలచిన నాలుగు లేబర్ కోడ్ల ను రద్దు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 600లు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాదరాజు గంగాధర్, సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, నాయకులు సెల్వకుమార్, పెంచలయ్య, కృష్ణచైతన్య, సుబ్బరాయుడు, అంగన్వాడీ నాయకులు సరోజనమ్మ, నిర్మలమ్మ, ఆశ వర్కర్లు రత్నమ్మ, భాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాల్లో చేప పిల్లల విడుదల



సోమశిల వెనుకజలాల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్న నాయకులు

నందలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని మత్స్య క్షేత్రాల నుంచి 19 లక్షల చేప పిల్లలను సేకరించి మదన మోహనపురం గ్రామ సర్పంచ్ చుక్కా నిర్మల, టీడీపీనాయకులు చుక్కా యానాది, ఉపసర్పంచ్ పుల్లయ్య మండలంలోని కోనాపురం వద్ద సోమశిల వెనుకజలాల్లో బుధవారం విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, వీఆర్వో శివప్రసాద్, మత్స్యశాఖ అధికారులు వెంకటరమణ, రామ్మోహన్, సుబ్బనరసయ్య,మోహనకృష్ణ, మురళీ, బ్రహ్మానందరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలతో రైతులకు లబ్ధి

సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలతో రైతులకు ఎంతో మేలు చేకూరిందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) తెలిపారు. బుధవారం మండలంలోని జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలతో మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీ ల్లో పశువులకు వైద్యాన్ని అందించినట్లు తెలిపారు. జీ.రెడ్డి వారిపల్లె గ్రామ పంచాయతీలో 1,384 గొర్రెలకు, 38 దూడలకు వైద్యసేవలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఓబులవారిపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముక్కావారిపల్లె వైద్యులు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. బాలింతలు, గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకుని మందులు తీసుకో వాలన్నారు. వైద్య సిబ్బంది వెంకటసుబ్బయ్య, వనిత, ఆశాలత పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో : ఒకరి మృతి

రాజంపేట టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బైక్‌ను బొలెరో ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రాజంపేట పట్టణం రాంనగర్‌కు చెందిన వెంకటసాయి (22) బుధవారం రాత్రి పట్టణం నుంచి బోయినపల్లి వైపు వెళుతుండగా కడప నుంచి టమోటాల లోడుతో వస్తున్న బొలెరో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

మద్యం మత్తులో అతివేగంగా ఆటో నడపడంతో అది అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొనడంతో షేక్ జఫ్రుల్లా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు బుధవారం అర్ధరాత్రి సమయంలో మరో ఆటో వాలాతో పోటీ పెట్టుకున్న జఫ్రుల్లా ఆటోను వేగంగా నడుపుతుండగా స్థానిక అమ్మవారి శాల సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించనున్నట్లు బంధువులు తెలిపారు..

మాన్యం భూమికి హద్దుల ఏర్పాటు

సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్తికేయ స్వామి మాన్యం భూముల్లో బుధవారం సర్వే చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని కార్తికేయనగర్‌లో సర్వే నెంబర్ 2256లో 43 సెంట్లు, 2259 సర్వే నెంబర్‌లో 8 సెంట్ల దేవదాయ శాఖ భూములకు కంచె ఏర్పాటు చేయనున్నట్లు కౌలుదారు దొరస్వామినాయుడు తెలిపారు. ఈ భూముల్లో తాత్కాలిక రోడ్డును సైతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు కీర్తన, జగదీశ్వర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నేడు శివాలయం కమిటీ సమావేశం

సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి వేడుకల నిర్వహణపై చర్చించనుండడంతో కమిటీ సభ్యులందరూ తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

టెండర్ నోటీస్

రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పరిశీలన ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలలోని బాలిక విద్యార్థుల శిక్షణ (నిర్దేశిత) కార్యకలాపాల అమలు కొరకు అర్హత గల ఏజెన్సీల నుండి (సంబంధిత ధృవపత్రంలను జతపరిస్తూ) తేది 03.02.2025 సాయంత్రం 5.00 గంటల లోగా దరఖాస్తులను సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయము, అన్నమయ్య జిల్లా నందు సమర్పించవలసినదిగా కోరడమైనది. తదుపరి వివరముల కొరకు సమగ్రశిక్ష, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయము, అన్నమయ్య జిల్లా నందు సంప్రదించవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- అదనపు పథక సమన్వయకర్త, సమగ్రశిక్ష, అన్నమయ్య జిల్లా.

పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయమా?

- ● 800 బొప్పాయి మొక్కలు తొలగించిన అధికారులు
- ● చమర్తి జగన్‌మోహన్ రాజు ఆగ్రహం



రైతు వెంకటసుబ్బమ్మ నుంచి వివరాలు తెలుసుకుంటున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమాచారం లేకుండా పేద మహిళా రైతు పొలంలోని 800 బొప్పాయి మొక్కలను రెవెన్యూ అధికారులు తొలగించారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆరోపించారు. బుధవారం మండలంలో శేషమాంబపురంలో టీడీపీ కార్యకర్త సంగరాజు వెంకటసుబ్బమ్మ సాగు చేసుకుంటున్న భూ మిని పరిశీలించారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఒక్క సెంటు ఆక్రమించుకుంటే ఎక్కడా లేని చట్టాలు రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీకి గుర్తుకు వస్తాయన్నారు. పట్టాభూమి లో ఉన్న స్తంభాలన్నింటిని ధ్వంసం చేయడం చూస్తుంటే ఆమె వైసీపీ ఏజెంటుగా పనిచేస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమించారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి గడువు ఇచ్చారన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను దోచుకున్న వారికి నోటీసులతో సరిపెట్టడంలో అర్థమేమిటన్నారు. గతంలో ఈ తహసీల్దారు పనిచేసిన చోటల్లా పేదల పొట్ట కొట్టి పెద్దలకు దోచిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. నేటి నుంచి తహసీల్దారు అవినీతిని బట్టబయలు చేస్తామని అన్నారు. వైసీపీకి తొత్తులుగా ఉన్న అధికారులకు అతి త్వరలోనే మంచి బహుమతి అందిస్తామని చమర్తి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు, రాజంపేట మండల రూరల్ టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, టీడీపీ మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేపూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోని మొక్కలనే తొలగించాం

తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేశామని, ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలనే తొలగించామని తహసీల్దారు పీరుమున్నీ తెలిపారు. సర్వే చేసి, అది ప్రభుత్వ భూమి అని సర్వేయర్, వీఆర్వో గుర్తించిన తర్వాతనే తాము విచారణ చేసి ప్రభుత్వ భూమిలో ఉన్న చెట్లను మాత్రమే తొలగించామన్నారు

కేసీపల్లెకు వ్యవసాయ శాస్త్రవేత్తల పరుగులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పెనగలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు హుటాహుటిన బుధ వారం కోడిచిన్నయ్యగారి పల్లెకు చేరుకుని వరి రైతులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. వివరాలిలా ఉన్నాయి., కోడిచిన్నయ్యగారిపల్లెకు చెందిన రైతులు తాము సాగుచేసిన వరిపైరు దుస్థితిపై రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వెంటనే కోడిచెన్నయ్యగారిపల్లెకు వెళ్లాలని ఆదేశించడంతో శాస్త్రవేత్తలతో పాటు స్థానిక అధికారులు బుధవారం ఆ గ్రామానికి వెళ్లారని మండల వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. నారు పోసేముందు నుంచి కోతదశ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ, ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో సుచిత్ర, మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ సంయుక్త కార్యదర్శిగా మల్లికార్జున



పెనగలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ రాష్ట్ర సం యుక్త కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కేంద్రానికి చెందిన కోడూరు మల్లికార్జున తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో జరిగిన ఏబీవీపీ 43వ వార్షిక సమావేశాల్లో తన నియామకం జరిగిందని ఆయన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల ఏబీవీపీ కన్వీనర్లు మాణిక్యరాజు, జేసీ నాగిరెడ్డి సహకారమందించిన ఏబీవీపీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నారా లోకేశ్‌ను కలిసిన సిద్దవటం నేతలు

సిద్దవటం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలియజేశారు. బుధవారం తాము విజయవాడలోని ప్రజా దర్బార్‌లో ఆయనను కలిసి మండలంలోని సమస్యలు వివరించగా, వైసీపీ అధికారంలో ఉన్నపుడు పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటామని , యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా పాల్గొన్నారు.

వసతులున్నా.. రోడ్లపైనే...


రైతుబజారు బయట గేటు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

- వెలవెలబోతున్న రైతుబజార్
- వసతులు అధునాతనం
- రైతులు రాక.. వ్యాపారులు లేక...
- రూ.కోటి ప్రభుత్వ ధనం నిరుపయోగం
- 50 గదులున్నా ఇద్దరే వ్యాపారులు
- మార్కెటింగ్‌శాఖ అధికారుల ప్రయత్నాలు విఫలం
- ఇదీ రాయచోటిలో రైతు బజార్ దుస్థితి

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ నడిబొడ్డులో బస్టాండుకు అత్యంత సమీపంలో రూ.కోటి నిధులతో నిర్మించిన రైతు బజార్‌కు రైతులు రాక, వ్యాపారాలు లేక వెలవెలబోతోంది. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన నూతన రైతు బజార్‌లో వ్యాపారులు సౌకర్యార్థం 50 గదులు ఏర్పాటు చేసినప్పటికీ కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే అక్కడ వ్యాపారాలు చేస్తుండడంతో కొనుగోలుదాడులు రాకపోవడమే కాకుండా పంటలు పండించే రైతులు సైతం తాము పండించే కూరగాయలను రైతుబజార్‌కు తీసుకురాకపోవడంతో అక్కడ కూరగాయలు విక్రయిస్తున్న ఒకరిద్దరు వ్యాపారులు కూడా రైతు బజారు ముందు భాగంలో ఆరుబయటనే వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు నివాసాల నిర్మాణాలతో పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం అధునాతన రైతు బజారు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయలు వెచ్చించి గాలివీడు మార్గం నుంచి బస్టాండుకు వచ్చే రోడ్డు పక్కనే నూతన రైతు బజారును నిర్మించారు. రైతు బజారు నిర్మాణం పూర్తయిన అనంతరం 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారును ప్రారంభించగా అప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు రైతు బజారు బాగానే నడిచినప్పటికీ సంవత్సర కాలంగా కొనుగోలుదారులతో పాటు పంటలు పండించే రైతులు రైతుబజారుకు సక్రమంగా రాకపోవడంతో వ్యాపారాలు రోజు రోజు తగ్గిపోతూ వచ్చాయి. దీంతో అక్కడ వ్యాపారం చేసుకునే వ్యాపారులు ఒక్కొక్కరిగా రైతు బజారు నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపైన వ్యాపారాలు పెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా మిగిలిన ఒకరిద్దరూ మాత్రం రైతు బజారు ముందు భాగంలోనే ఆరుబయట రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో కోటి రూపాయలతో 50 గదులతో పాటు నాలుగు స్టాక్ రూములతో నిర్మించిన రైతు బజారు వెలవెలబోతోంది.

దళారుల మాయలో రైతులు

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలు తమ పంటలను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతుబజార్‌ను నిర్మించింది. కానీ రైతులు మాత్రం ఇక్కడకు రాకుండా పాత మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొంతమంది దళారుల చేత మోసపోతూనే ఉన్నారు. రైతులు పండించి మార్కెట్‌కి తీసుకొస్తున్న టమోటాలు, పచ్చిమిరపకాయలు, బెండకాయలు, వంకాయలు తదతర కూరగాయలను దళారులు, వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు మాత్రం ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అధికారులు పదేపదే చెబుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైతు బజారులో పంటలను విక్రయించుకుని లబ్ధి పొందాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వాటిని పట్టించుకోకుండా దళారులను నమ్మి మోసపోతున్నారు.


వీరభద్రస్వామి గుడి ఎదురుగా మార్కెట్‌లో రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు

రోడ్డుపైనే విక్రయాలు...

రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కూరగాయల వ్యాపారులు రైతు బజారులో కాకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన, డ్రైనేజీ కాలువలపైన, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రైనేజీలు ఆక్రమిస్తే మాకేంటి.. రోడ్లపైన వ్యాపారాలు చేస్తే మాకేంటి అన్న చందంగా అటు మున్సిపల్ అధికారులు, ఇటు ట్రాఫిక్ అధికారులు వ్యవహరిస్తుండడంతో పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా కోటి రూపాయలతో నిర్మించిన రైతుబజారు అత్యంత సౌకర్యవంతంగా అందుబాటులో ఉన్నప్పటికీ కొంత మంది వ్యాపారులు మాత్రం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో, డీఈవో కార్యాలయం ముందు భాగంలో, వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో, సుండుపల్లె రోడ్డులోని డ్రైనేజీపై, మార్కెట్‌వీధిలో రోడ్లపైన ఇలా ఎక్కడపడితే అక్కడ కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారు. కొనుగోలుదారుల వాహనాలు, ఆటోలు ఇలా రోడ్లపైన నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై జరుగుతున్న కూరగాయల విక్రయాలను నియంత్రించి ఖాళీగా ఉన్న రైతు బజారులోకి వ్యాపారులను తరలించి వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం

రాయచోటి పట్టణంలో ఉన్న రైతు బజారును వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం. 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారు ప్రారంభించినప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు అక్కడ వ్యాపారాలు బాగానే జరిగాయి. ఇటీవల కాలంలో కొంతమంది రైతులు తాము పండించిన పంటలను అక్కడికి తీసుకురాకపోవడం, కొనుగోలుదారులు సరిగ్గా రాకపోవడంతో అక్కడ ఉంటున్న వ్యాపారులు గిట్టుబాటు కాలేదంటూ ఒక్కొక్కరే దూరమయ్యారు.

-నాగరాజు, ఏడీ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, రాయచోటి


రూ.కోటి నిధులతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజార్


రైతుబజార్‌లో అధునాతనంగా నిర్మించిన స్టాల్స్

వినియోగంలోకి తీసుకురావాలి



పట్టణ నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న రైతుబజారును వినియోగంలోకి తీసుకురావాలి. ఎంతోమంది రైతులు ఆరుగాలం కష్టపడి తాము పండించిన పంటలను దళారులు, వ్యాపారుల చేతిలో పెట్టి మోసపోతున్నారు. పట్టణంలోని వాహన దారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన జరుగుతున్న కూరగాయల వ్యాపారాలను రైతుబజారులోకి తీసుకొచ్చి కొనుగోలు దారులకు తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు లభించేలా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతు బజారులో రైతులకు, వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

-సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష

- చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో 2022 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో బుధవారం చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు 4 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీ బాలికను సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన కోటకొండ చరణ్, తిరుపతి పట్టణానికి చెందిన షేక్ హేమద్‌లు కిడ్నాప్ చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును దర్యాప్తు చేసిన మదనపల్లి టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారన్నారు. బుధవారం ఈ కేసు పూర్వాపరాలను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితులకు చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి నిందితులకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్షపడటంలో కృషి చేసిన స్పెషల్ పీపీవీ శైలజ, మదనపల్లి డీఎస్పీ కొండయ్యానాయుడు, మదనపల్లె టూటౌన్ సీఐ కె.రామచంద్ర, దర్యాప్తు అధికారి, ఎస్‌ఐ చంద్రమోహన్, మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌కే రహీముల్లా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ హరిబాబునాయక్, చిత్తూరు కోర్టు లైజర్ హెడ్ కానిస్టేబుల్, టీసీ సాయి సుధాకర్‌లను ఎస్పీ అభినందించారు.

బోర్డులు తొలగిస్తే కేసులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నాటిన బోర్డులు తొలగించిన వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటి వాండ్లపల్లె, జగనన్న కాలనీ ఎదురుగా సర్వే నెంబర్ 2574-3లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం పేరిట నాటిన బోర్డు భూకబ్జాదారులు తొలగించారని కథనం రావడంతో ఆ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బోర్డు తొలగించిన ప్రదేశంలో ఇది ప్రభుత్వ స్థలం, ఇందులోకి అనుమతిలేకుండా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని తిరిగి బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో మట్టి తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వో సంతోశ్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగంధం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనం, దుంగలతో ఫారెస్టు సిబ్బంది

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా 43 కేజీల శ్రీగంధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ బుధవారం తెలిపారు. శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము మంగళవారం రాత్రి చిత్తూరు జిల్లా కల్లూరులో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు.

రాత్రి 11 గంటల ప్రాంతంలో పీలేరు వైపు నుంచి వచ్చిన టీఎస్-23 బీఈ 5179 నెంబరు గల ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు తాము ఆపినా ఆపకుండా సదుం వైపు వెళ్లిందన్నారు. ఆ కారును తాము వెంబడించగా అందులోని వ్యక్తి దానిని కల్లూరు ఎగువవీధి వద్ద ఆపి పారిపోయాడన్నారు. కారును తనిఖీ చేయగా 3 బస్తాలలో 43 కేజీలు బరువున్న శ్రీగంధం లభ్యమైందన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో తనతో పాటు ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది నందీశ్వరులు, సురేశ్ రాజు, సుబ్రహ్మణ్యం, చరణ్ పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

591 కల్తీ మద్యం సీసాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీగా కల్తీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. అనంతరాజుపేటకు చెందిన ఎం.అయ్యప్ప, ఓబులవారిపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన వెంకటనారాయణ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించి 591 కల్తీ మద్యం సీసాలు, రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసులో ప్రధాన నిందితులైన తిరుపతివాసులు ఆర్.వెంకటరమణ, జయబాబు పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నామన్నారు. దాడుల్లో సీఐ ఎల్లయ్య, నీలకంఠేశ్వరరెడ్డి, తులసి, ఎస్‌ఐలు శశిధర్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ : ఒకరి మృతి

ఓబులవారిపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడపకు చెందిన రుద్రరాజు సుబ్రమణ్యం రాజు (46), అనంతరాజుపేటకు చెందిన రెడ్డెయ్యతో కలిసి బుధవారం రాత్రి కారులో కొర్లకుంట నుంచి కోడూరు వైపు వెళుతుండగా మండలంలోని మంగంపేట సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి గుడి సమీపంలో చెన్నై నుంచి పూణె వెళుతున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న సుబ్రమణ్యంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రెడ్డయ్యకు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి తిరుపతికి తరలించినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.ఈ సమాచారం తెలియడంతో ఎమ్మెల్యే శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.


కంటైనర్‌ను ఢీకొన్న కారు. కారులోనే మృతి చెందిన సుబ్రమణ్యంరాజు

డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు...

- కురబలకోటలో రెవెన్యూ లీల


ముదివేడు సమీపంలోని తానా మిట్ట వద్ద భూమి

కురబలకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు ఆ పార్టీకి చెందిన నేతలకు ఇష్టానుసారంగా డీకేటీ భూములను అప్పనంగా రాసిచ్చేశారు. కురబలకోటలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు పేదలకు చేయాల్సిన పనులు ఏమాత్రం చేయరు కానీ...పైసలిస్తే మాత్రం చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ భూముల్లో వ్యవసాయం చేసుకోవాలి. ఈ భూమి వారసత్వంగా తమ కుటుంబీకులకు సంక్రమిస్తుంది తప్ప ఇతరులెవ్వరికీ సంక్రమించదు. అంతేకాకుండా వంశపారపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు, ఇతరులకు అప్పగించడం చట్ట రీత్యా చేయకూడదు. కానీ చాలాచోట్ల 99 ఏళ్ల శాశ్వత కొనుగోళ్ల పేరుతో క్రయ, విక్రయాలు చేపట్టి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ తంతు చట్ట ప్రకారం చెల్లుబాటు కావన్న విషయం బహిర్గతమే. అయితే చట్టప్రకారం ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు.

కానీ ఇక్కడ పనిచేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఏమాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు. ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. భూముల ధరలు ఆకాశాన్నంటాయి.

కడప-మదనపల్లె రహదారిలోని తానామిట్ట వద్ద సర్వే నెంబర్ 1630లోని భూమి గత ప్రభుత్వ హయాంలో ఇసుక నిల్వలు చేయడానికి వినియోగించారు. అయితే ఈ భూమికి మహమ్మద్ అఫ్రిది పేరుతో 2159 ఖాతా నెంబర్‌లో విస్తీర్ణం 4 ఎకరాల భూమిని, ఇదే సర్వే నెంబర్‌లోని భూమిని శరీనాబీ పేరుతో 2198 ఖాతా నెంబర్ 25 సెంట్ల భూమిని అనువంశికం ద్వారా సంక్రమించినట్లు వన్‌బీ అడంగల్ హక్కును రెవెన్యూ అధికారులు కల్పించారు.

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు

ఈ భూములకు సంబంధించి గతంలో ఏమి జరిగిందో నాకు తెలియదు. ఎవరు పాసుపుస్తకాలు మంజూరు చేశారో నాకు తెలియదు. ఈ భూమికి సంబంధించిన విషయం నా దృష్టికి రాలేదు. ఒకవేళ వీటికి సంబంధించి ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాము.

- తపస్విని, తహసీల్దార్

పాడి రైతుల సమగ్రాభివృద్ధే 'హెరిటేజ్' లక్ష్యం

- పాడి రైతుల మహాసదస్సులో నారా భువనేశ్వరి


ప్రమాద బాధితులకు బీమా చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉత్పత్తులు, వినియోగదారుల సంతృప్తి, పాడి రైతుల సమగ్రాభివృద్ధే తమ సంస్థ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరులోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం జరిగిన పాడి రైతుల మహా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న చిత్తూరు జిల్లా పాడి రైతుల ఆదాయాన్ని పెంచి వారికి సుస్థిర అభివృద్ధిని కలగజేసేందుకు 32 ఏళ్ల క్రితం హెరిటేజ్ సంస్థను ప్రారంభించామన్నారు. ఏనాడూ రైతులకు ఆలస్యంగా చెల్లింపులు చేసిన దాఖలాలు లేవన్నారు. నేడు తమ సంస్థ ద్వారా దేశంలోని 9 రాష్ట్రాల్లో రోజుకు 9 వేల గ్రామాల నుంచి 200 చిల్లింగ్ యూనిట్ల ద్వారా 3 లక్షల మంది రైతుల దగ్గర నుంచి 18.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామన్నారు. 12 రాష్ట్రాల్లో తమ అమ్మకాలు సాగుతున్నాయన్నారు. డ్వాక్రా సంఘాల తరహాలో హెరిటేజ్ సంస్థలోనూ మహిళా పాడి రైతుల గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి విరివిగా రుణాలు అందిస్తున్నామన్నారు. కేవలం పాల సేకరణతోనే సరిపెట్టకుండా అటు పాడికి, ఇటు రైతులకు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నాణ్యమైన పాడి ద్వారానే నాణ్యమైన పాలు సాధ్యమని నమ్మి పశుసంవర్ధక సేవలు కూడా అందిస్తున్నామన్నారు. గడిచిన ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వేయి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 12 వేల ఆవులకు ఉచితంగా వైద్యం అందించామన్నారు. హెరిటేజ్ ఫిన్‌లీస్ లిమిటెడ్ ద్వారా రైతులకు వారి పాల సరఫరా ఆధారంగా సాధారణ, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నామని, గత ఏడాది తమ సంస్థ ద్వారా రూ.139.11 కోట్ల రుణాలు అందజేయగా అందులో చిత్తూరు జిల్లా రైతులకు రూ.16.12 అందజేశామన్నారు. 'హెరిటేజ్ వెట్' అనే యూట్యూబ్ చానెల్ ద్వారా పశువుల ఆరోగ్యం, వ్యాధి నివారణ-నిర్ధారణ, సైలేజ్ తయారీ, శుభ్రమైన పాల ఉత్పత్తి పద్ధతులపై విలువైన సమాచారాన్ని రైతులకు అందజేస్తున్నామన్నారు.

పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్థక పద్ధతులను ప్రోత్సహించడానికి అమెరికాకు చెందిన 'టెక్నో సెర్వ్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నామని, ఆ సంస్థ భాగస్వామ్యంతో పశు, రైతుల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఆమె సమక్షంలో హెరిటేజ్, టెక్నో సెర్వ్ సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఆమె రూ.183.5 లక్షల రుణ చెక్కును పాడి రైతులకు అందజేశారు. పలు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల కుటుంబాలకు రూ.21.45 లక్షల చెక్కులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది మహిళా ఏజెంట్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సీవోవో సాంబమూర్తి, పాలసేకరణ విభాగం అధిపతి రామ్మోహన్ రావు, హెరిటేజ్ సంస్థ ఉన్నతాధికారులు గోపాలకృష్ణ, సర్వోత్తమ రెడ్డి, దామోదర్ నాయుడు, 'టెక్నో సెర్వ్' సంస్థ ప్రతినిధులు జయదీప్ దత్తా, వీఎస్ రామకృష్ణ, చంద్రశేఖర రావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం వేంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సెల్వరాజ్ పాల్గొన్నారు.

తగ్గేదేలే...



- బద్వేలులో జోరుగా గంజాయి విక్రయాలు
- నెల్లూరు- ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి దిగుమతి
- నియోజకవర్గ వ్యాప్తంగా సరఫరా
- నామమాత్రంగా పోలీసు దాడులు

బద్వేలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది గ్యాంగ్‌లా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడకు గంజాయి తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ గంజాయి దొరుకుతుండటంతో యువత బానిసలుగా మారుతున్నారు. కొందరు కూలీనాలీ చేసుకునే వారు గంజాయి పీల్చుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

గత జగన్ ప్రభుత్వంలో గంజాయి మాఫియా రాజ్యమేలందంటారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు తమ ప్రభుత్వం ఏర్పాటు అయితే గంజాయి మాఫియా భరతం పడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు అయినా ఆచరణలో అమలు కాలేదు. ఇక పోలీసులు మాత్రం నామమాత్రపు దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటు న్నారు. దీంతో గంజాయి గ్యాంగ్ తగ్గేదేలేదు అన్నట్లు జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా సరఫరా

గంజాయి విక్రయాలు చేస్తున్న ఐదారుగురు బద్వేలు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. వీరు నెల్లూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాల నుంచి పెద్ద ఎత్తున బద్వేలుకు గంజాయి తీసుకు వచ్చి ఇక్కడ విక్రయించడంతోపాటు వారికున్న పరిచయాల ద్వారా నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా వీరంతా గంజాయి వ్యాపారం సాగిస్తూ వచ్చారు. వీరిలో ఇప్పుడు ఒకరిద్దరు లేకపోయినా మిగతావారు ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. బద్వేలు పట్టణంలోని శివాలయం పరిసర ప్రాంతాలలో గల చెట్లచాటున, మార్కెట్‌యార్డు ప్రాంతంలో, పోరుమామిళ్ల రోడ్డులోని మరో ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి పెద్ద మొత్తంలో బద్వేలుకు తెచ్చి పట్టణంలోని పలుచోట్ల వారి మనుషుల ద్వారా విక్రయించడం, లేదా నేరుగా వారే విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు కేజీలు, అరకేజీలు లెక్కన పంపిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

గంజాయి విక్రయాలకు సంబంధించి నాలుగు రోజుల క్రితం ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యక్తి ద్వారా గంజాయి వ్యాపారానికి సంబంధించిన కూపీ లాగుతున్నట్లు సమాచారం. బద్వేలు కేంద్రంగా ఎంతమంది వ్యాపారాలు సాగిస్తున్నారు.. ఎక్కడికి సరఫరా చేస్తున్నారు.. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే విషయాలపై ఆరా తీయడంతో పాటు గంజాయి విక్రేతలపై నిఘా ఉంచినట్లు సమాచారం.

మత్తులో యువత

గంజాయి యథేచ్ఛగా దొరుకుతుండడంతో కొందరు యువత బానిస లుగా మారుతున్నారు. వీరితోపాటు కూలీనాలి చేసుకునే కొందరు బానిసలై గంజాయి మత్తులో తూలుతున్నారు. గంజాయిని పొడిచేసి సిగరేట్‌లో ఉండే పొగాకు తొలగించి గంజాయిపొడి వేసి పీల్చుతారు. ఇంకొందరు చిన్న చిన్న ప్లాస్టిక్ సీసాలలో కూడా గంజాయికూర్చి వాటిద్వారా సేవిస్తున్నారు. దీంతో వీరంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్‌శాఖాధికారులు ప్రత్యేక దృష్టితో సారించి గంజాయి విక్రయాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై బద్వేలు సీఐ రాజగోపాల్‌ను వివరణ కోరగా.. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయంలో ఈడీ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన వేతనాల ప్రకారం కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. అందించే వేతనాల్లో భారీ వ్యత్యాసాలున్నాయన్నారు. కావున కాంట్రాక్టర్ల ద్వారా అందే వేతనాలు సక్ర మంగా అందేలా చూడాలన్నారు. లేబర్ కమిషనర్ ఇచ్చిన ప్రకారం కార్మికులకు రావలసిన సెలవులు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు ఈఎస్ఐ కార్డులు కాంట్రాక్టర్ ద్వారా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్, స్టీఫెన్‌ఆంథోని, శ్రీనివాసులు, శివశంకర్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ప్రవీణ్‌కుమార్



కడప రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ బుధవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఆయన కడప కోర్టులో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. గతంలో జిల్లా న్యాయసేవాధికరా సంస్థ సెక్రటరీగా, సీనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడే పనిచేశారు. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలం పెట్టించడంలో కృషి చేశారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హనుమంతు

కాశినాయన జనవరి 29 (ఆంధ్రజ్యోతి) బి.మఠం మండలం తోట్లపల్లె వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు తెలుగంగ ఎడమ కాలువలో పడిన రామయ్య అనే వ్యక్తి బుధవారం అంబవరం వద్ద శవమై కన్పించినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలీ మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి రామయ్య భార్య భర్తలు. వీరికి పిల్లలు లేరు. గత 20 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల నుంచి మఠం మండలం తోట్ల పల్లి సమీపంలోని అచలానంద ఆశ్రమంలో ఉంటున్నారు. మంగళవారం ఇరువురు కలిసి తెలుగంగ కాలువ వద్ద బట్టలు ఉతుక్కుంటుండగా ప్రమాదవశాత్తు రామయ్య కాలువలో జారి పడి.. నీటిలో కొట్టుకొచ్చి బుధవారం అంబవరం వద్ద కాలువలో శవమై కన్పించాడు. అతని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆకతాయిల నిప్పు... 200 మామిడి చెట్లు దగ్ధం

- రూ.10లక్షలు నష్టం



కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణ శివారు పరిధి బుగ్గవంక సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 200 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. బాధితుల వివరాల మేరకు.. సీకే దిన్నె మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ బుగ్గల పల్లెలోని తుమ్మలకుంట మహాలక్ష్మి, శివక్రిష్ణ, నాగలక్ష్మి, ఈశ్వర్‌లకు సంబంధించి సుమారు ఐదెకరాల పరిధిలో ఉన్న 200 మామిడి చెట్లు ఓ ఆకతాయి సిగరెట్ తాగి పారేయడంతో కాలిపోయాయి. ఘటనలో డ్రిప్ పరికరాలు, పైపులు పూర్తిగా పాడయ్యాయి. మామిడి చెట్లు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ స్థితిలో మామిడిచెట్లు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యాన అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి తమను ఆదుకోవాలని వారు కోరారు.

ముగ్గురు మట్కాబీటర్లు అరెస్టు

వల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గణేశ్‌పురం సమీపంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ తెలి పారు. మట్కా ఆడుతున్నారన్న సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి దాడులు చేసి గణేశ్‌పురంలో మూతబడిన పెట్రోలు బంకు వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.50,420 నగదు స్వాధీనం చేసుకొని పట్టుబడిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

- అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ



మాట్లాడుతున్న అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ

వేముల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అన్నారు. బుధవారం వేముల సభాభవనంలో గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ, అవగాహన కార్యక్రమం చేస్తున్న విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ వీఎన్‌పీ శివరామకృష్ణ, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, నాబార్డు డీడీఎం విహారి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, అరటి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ, కదిరి బాబు రావు కళాశాల టీచింగ్ అసోసియేట్ అఖిల్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అరటి పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు వివ రించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ చీనీ పంటలో బెలుకును ఎక్కువగా వాడకూడదని, నీటిని తగిన మోతాదులో పెట్టాలన్నారు. నాబార్డు డీడీఎం విహారి, శాస్త్రవేత్త రేష్మ మాట్లాడారు.

క్రీడా పోటీల్లో పశువైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థి సాయి తేజశ్వని క్రీడల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించిందని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో కళాశాల బాలికల జట్టు విజేతగా నిలిచిందన్నారు. బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. బాలుర క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారెమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. సాంస్కృతిక విభాగంలో వివిధ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని తెలిపారు. నృత్యం, జానపద నృత్య ప్రదర్శనలలో సాహిత్య విభాగంలో పశువైద్య విద్యార్థులు బహుమతులను దక్కించుకున్నారని, క్విజ్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన 105 మంది విద్యార్థులను అభినందించారు. పశువైద్యులు హరిప్రియ, కల్యాణి, ఇందిర, చరిత, రాజకిశోర్, కల్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

హాకీలో కడపకు ద్వితీయ స్థానం

- ముగిసిన ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన కడప జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్‌ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతల కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు హనీష్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్‌సాహిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాల కోసం అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ, సామాజిక వర్గాలకు చెందిన అర్హులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు.

ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. దరఖా స్తు ప్రక్రియ ముగిసిన వెంటనే స్థానిక ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తిస్తామన్నారు. మార్చి 9వ తేదీలోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవుతుందని వివరించారు.

హైవేపై విద్యుత్ దీపాల వెలుగులు



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న కొండాపురం పట్టణం

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పుణ్యమా అని కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. కొండాపురం పట్టణం గుండా వెళ్లే నేషన్ హైవే (ఎన్‌హెచ్-67) రహదారిపై మంగళవారం విద్యుత్ దీపాలను వెలిగించారు. ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవే పనుల్లో భాగంగా కొండాపురం పట్టణంలో విద్యుత్ దీపాలను అమర్చారు. రోడ్డుకు ఇరువైపులా 128 లైట్లను అమర్చారు. వీటిని మంగళవారం రాత్రి హైవే అధికారులు ప్రారంభించడంతో కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో వెలిగిపోతోంది.

ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం ఎప్పుడో...!

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- ప్రయాణికులు, స్థానిక ప్రజల ఇక్కట్లు

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ ప్రారం భం కోసం ప్రయాణీకులు ఎదురుచూపులు చూస్తున్నారు. బస్టాండ్ నిర్మాణం పూర్తై మూడు నెలలు గడస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బం దులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

వేంపల్లె పట్టణం చుట్టుపక్కల ఐదు మండలాలకు ప్రధాన కేంద్రం. అలాగే కడప, పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు పట్టణాలకు వేంపల్లె ద్వారా నిత్యం బస్సులు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో గత ప్రభుత్వంలో ప్రయాణీకుల సౌకర్యార్థం సుమారు రూ.2.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల సమ యంలో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇక్కడి టీడీపీ నాయకుల విన్నపం మేరకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలు రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. బస్టాండ్ పూర్తయి దాదాపు మూడు నెలలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస్టాం డ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే బస్సులు నిలుపు తుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఇక కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లను నిర్మించినప్ప టికీ అవి తెరకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. పూర్తైన బస్టాండ్‌ను త్వరగా ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఆదిశగా అధికారపార్టీ నాయ కులు, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.



వేంపల్లెలో పూర్తైన ఆర్టీసీ బస్టాండ్

ఫర్నీచర్ కోసమే జాప్యం

కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయింది. అయితే బస్టాండ్‌లో ప్రయా ణికులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్ అందు బాటులో లేదు. ఈవిషయం ఆలస్యంగా గుర్తించిన ఆర్టీసీ అధికారులు ఫర్నీచర్ కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. టెండర్ ద్వారా ఈ ఫర్నీచర్‌ను సమకూర్చుకోవాల్సి ఉంది. దీని కోసం బస్టాండ్ ప్రారంభా నికి ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

ప్రారంభానికి నోచుకోకపోవడంతో బస్సుల రాకపోకలు లేక నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్





ఫర్నీచర్ లేక ఖాళీగా ఉన్న బస్టాండ్ లోపలి భాగం

సమస్య ఆర్‌ఎం దృష్టికి...

వేంపల్లెలో బస్టాండ్ నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోని విషయం ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా.. రూ.3లక్షల ఫర్నీచర్ కోసం ఉన్నతాధికారులకు కొటేషన్ పంపాం. త్వరలోనే ఫర్నీచర్‌ను బస్టాండ్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చి మంత్రి ద్వారా బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

నిధులు మంజూరు చేయండి

● సీఎంకు ఎమ్మెల్యే వినతి



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సీటీఎం రోడ్డు విస్తరణ, బాహుదాపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా సీఎం చంద్రబాబునాయుడును కోరారు. బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సీఎంను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా గతంలో హామీ ఇచ్చిన మేరకు నిధుల మంజూరుకు జీవో ఇవ్వాలని కోరారు. అలాగే మదనపల్లె మండ లం బసినికొండ బైపాస్ రోడ్డు వద్ద గల స్వామిచెరువు సుందరీకరణకు రూ.2కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. మదనపల్లెను వెంటనే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. పట్టణానికి చెందిన చాన్‌బాషా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లగా..సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

టీడీపీ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయండి



మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న తంబళ్లపల్లె టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటలో ఫ్లెక్సీల ధ్వంసం ఘటనపై టీడీపీ నాయకులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తేయాలని టీడీపీ నాయకులు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌లకు విన్నవించారు. బుధవారం విజయవాడలోని టీడీపీ జాతీయ కార్యా లయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తంబళ్లపల్లె నియో జకవర్గానికి చెందిన టీడీపీ మండలా ధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, నారాయణ స్వామిరెడ్డి, ఆనందరెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఇద్దరు మంత్రులను కలిసి వారి సమస్యలను విన్నవించారు. మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా బి.కొత్తకోటలో తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లను కొందరు ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులకు తాము ఫిర్యాదు చేస్తే, అక్కడి పోలీసులు టీడీపీ నాయకులపైనే రిటర్న్ కేసులు పెట్టారన్నారు. పార్టీ బలోపేతానికి కష్టప డిన తమపై కేసులు పెట్టడం బాధగా ఉందన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలసి సమస్యను విన్నవించారు. టీడీపీ నాయకులు రాజా, ప్రకాష్, నటరాజ్‌నాయక్, మనోహర్, ఈశ్వరప్ప, రంజిత్, రమణ, బయ్యారెడ్డి, వెంకటరెడ్డి, పురుషోత్తం, శ్రీనివాసులు, ఓబులేసు పాల్గొన్నారు.

జగన్ జమానాలో ప్రజాధనం లూటీ

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.8లక్షల కోట్లు దోపిడీ
- విలాసాలు...జల్సాలకు రూ.19,871కోట్లు దుబారా
- సూపర్‌సిక్స్‌పై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.8లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టాడని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ విలాసాలు, జల్సాల కోసం రూ.19,871 కోట్లు ప్రజాధనం దుబారా చేశాడని భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు తదితర వాటిలో అక్రమంగా కోట్లు సంపాదించుకున్నాడని ఆరోపించారు. రాష్ట్రానికి గుండకాయలాంటి సచివాలయాన్ని కడా తాకట్టుపెట్టిన ఘనత జగన్‌ది అన్నారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం, చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రూ.10లక్షల కోట్లు అప్పు చేసి ఏడాదికి రూ.71వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం మోపి ఆర్థిక వ్యవస్థను దివాలా తీసాడన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి గుదిబడగా తయారైందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి పంపిణీ చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కొకటిగా అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికివందనం, రైతులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే అమలవుతన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ నరసింహులు, నేతలు కట్టా సురేంద్రనాయుడు, ఉత్తమరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గంగాదేవి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, అయూబ్‌బాషా పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో పీలేరు అభివృద్ధి శూన్యం

● ఎమ్మెల్యే కిశోర్ చొరవతో కదలిక ● ఫైర్ స్టేషన్‌కు రూ.85లక్షలు మంజూరు
● మాజీ మార్కెట్ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరువాత పీలేరు నియోజకవర్గంలో ఏ దశలోనూ అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రాకతో మళ్లీ నియోజకవర్గ అభివృద్ధిలో కదలిక వచ్చిందన్నారు. స్థానిక మదనపల్లె రోడ్డులోని ఫైర్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణాలు పూర్తి చేయడానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.85 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే టెండర్లు పూర్తి చేసి నిర్మాణ పనుల పూర్తికి చర్యలు తీసుకోనున్నామన్నారు. వాల్మీకిపురం మండలంలో మొదటి విడ తగా రూ.1.35కోట్లతో 20సీసీ రోడ్ల పనులు మంజూరు కాగా 18పనులు పూర్తి అయ్యాయన్నారు. పీలేరు నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా గండికోట రిజర్వాయర్ నుంచి పైపు లైన్ ద్వారా శుద్ధ జలాలు ఇవ్వడానికి ప్రభుత్వం రూ.700 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డి, నాయకులు రాజేంద్రా చారి, పీవీ నారాయణ, చంద్రమౌళి, శేషాద్రి రెడ్డి, కువైట్ సయ్యద్‌బాషా, రామచంద్ర, తెలుగు యువత చాను, మురళి, యూసుఫ్, కాంతరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రాజగోపుర ప్రతిష్ఠోత్సవాలకు అంకురార్పణ



పూజా సామగ్రిని తీసుకువెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

తంబళ్లపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ నూతన రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవాలకు బుధవారం శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయానికి నూతనంగా రాజగోపురాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో మహోత్సవ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజైన బుధవారం టీటీడి వేదపండితులు వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం సాయంత్రం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, సిబ్బంది , అర్చకులు పాల్గొన్నారు.

బండెన్నస్వామి ఆలయం పరిశీలన

బి.కొత్తకోట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ పరిధిలోని బండెన్నస్వామి ఆలయాన్ని బి.కొత్తకోట తహసీల్దార్ అజారుద్దీన్ బుధవారం పరిశీలించారు. ఆలయం వద్ద రోడ్డు స్థితిగతులను పరిశీలించాల్సిందిగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి బి.కొత్తకోట తహసీల్దార్ కు ఆదేశాలు అందాయి. దీంతో తహసీల్దార్ తమ సిబ్బందితో ఆలయం వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతి స్వామితో మాట్లాడారు. ఒకవేళ కలెక్టర్ పర్యటన ఖరారైతే తగిన ఏర్పాట్లపై ఆయన చర్చించారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న 104 సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ ప్రజలకు సూచించారు. పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని చెరుకువారిపల్లె గ్రామంలో బుధవారం జరిగిన 104 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనాల ద్వారా ప్రభుత్వం దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తలపుల వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు పట్ల హర్షం

నిమ్మనపల్లె జనవరి 29(ఆంధ్రజ్యోతి): సినీన టుడు ప్రస్తుత హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, బీసీ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మన్న పేర్కొన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ క్రమశిక్షణతో ప్రజలలో మాస్ హీరోగా పేరుతెచ్చుకొన్న నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కో-ఆప్షన్ నెంబరు సుధాకర్‌రావు, మాజీ జడ్పీటీసీలు వసంతమునిరత్నం, రెడ్డెప్పరెడ్డి, టీడీపీ నాయకులు విజయ్, సూర్యప్రకాష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పశుబీమా నిధులు రూ. 27లక్షలు విడుదల

పెద్దమండ్యం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పశుబీమా నిధులు రూ. 27లక్షలు విడుదల చేసినట్లు పెద్దమం డ్యం మండల పశు వైద్యాధికారులు విక్ర మ్‌రెడ్డి, ఉస్మాన్ వెల్లడించారు. మండలం లో 90 మంది రైతులకు పశుబీమా క్లైమ్ లు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నా యన్నారు. కాగా ఇటీవల కూటమి ప్రభు త్వం ఒక్కొక్క పాడిఆవుకు రూ. 30 వేలు ప్రకారం 90 వాటికి రూ. 27 లక్షలు నిధు లు రావాల్సి ఉండగా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమా చేసినట్లు తెలిపారు. అలాగే పశు ఆసుపత్రులకు ప్రభుత్వం సంవృద్ధిగా పశువైద్య మందులు సరఫరా చేసినట్లు తెలిపారు. పశువైద్య సహాయకు లు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు ఘన సత్కారం



ఎంఈవోను సత్కరించిన శ్రీనివాసులునాయుడు, స్నేహితులు

మదనపల్లె అర్బన్, జనవరి 29:(ఆంధ్రజ్యోతి):గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న బి.కొత్తకోట ఎంఈవో రెడ్డిశేఖర్‌ను మదనపల్లెలో ఘనంగా సత్కరించారు. ఆయన చిన్ననాటి స్నేహితులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, మాజీ కౌన్సిలర్ సహజీవనబాబు, కునకుంట్ల చలపతి, ఉమేష్ నాయుడు బుధవారం పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల చింటూ, డాక్టర్ కుమార్, మధు, దామోదర్‌నాయుడు, సురేంద్ర, ఉషారాణి, మహేష్ పాల్గొన్నారు.

కస్తూరిబాగాంధీ విద్యాలయం సందర్శన

ములకలచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉమ్మడి రాష్ట్రాల ఛైర్మన్ తనకంటి వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఆయనతో పాటు చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారి షకీలా, సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్ మంజులమ్మ, గ్రామ జ్యోతి సొసైటీ ప్రెసిడెంట్ సుభద్ర తదితరులు సందర్శించారు. పాఠశాలలో విస్తుపోయే నిజాలు బయటపడడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు.

ఉపాధి పనులలో కూలీల సంఖ్యను పెంచాలి

తంబళ్లపల్లె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని ఏపీడీ మధుబాబు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీవో అంజినప్పతో కలసి ఎంటీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులకు వచ్చే విధంగా చైతన్య పరచాలన్నారు. గ్రామాలలో సగటున 20 నుంచి 40 మంది ఉపాధి కూలీలకు కలిపి శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి మేట్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎంటీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో మరోసారి ఆక్రమణలకు యత్నం

● తక్షణం స్పందించి ఖాళీ చేయించిన మున్సిపల్ అధికారులు



జ్యోతి బస్టాండ్‌లో ఆక్రమణదారుల సామగ్రిని తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బి.కొత్తకోట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట జ్యోతి సర్కిల్‌లో మరోసారి ప్రభుత్వ స్థలం ఆక్రమణ యత్నం జరిగింది. సమాచారం అందిన వెంటనే స్పందించిన నగరపంచాయతీ అధికారులు వాటిని తొలగించిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాలను, రోడ్లను, బస్‌షెల్టర్‌నుసైతం ఆక్రమించుకొని పలువురు వ్యాపారాలు సాగించుకుంటున్నా ఇన్నాళ్లూ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించేవారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ పల్లవి పట్టణంలోని జ్యోతిసర్కిల్‌తో పాటు ప్రధాన రోడ్లలో ఆక్రమణలను తొలగింపజే శారు. కాగా గత వారం రోజులుగా ఒక్కొక్కరుగా జ్యోతి సర్కిల్‌లో మళ్లీ ఆక్రమణలు మొదలెట్టారు. బుధవారం మరో అడుగు ముందుకేసి పాత తరహాలో అంబేడ్కర్ విగ్రహం చుట్టుపక్కల వరుసగా ఆక్రమణలకు పూనుకున్నారు. సమాచారం అందడంతో కమిషనర్ పల్లవి, ఏవో రమాదేవిలు పోలీసుల సాయంతో జ్యోతిసర్కిల్‌కు చేరుకొని నగరపంచాయతీ పారిశుధ్య సిబ్బందితో అన్ని టేబుళ్లు, కుర్చీలు, పూలు తదితర సామగ్రిని ట్రాక్టర్లలోకి నింపి కార్యాలయం వద్దకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జ్యోతిసర్కిల్ ఆధునీకీకరణకు ప్రతిపాదనలు పంపామని నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

దళిత రైతు మృతి కారకులపై చర్యలు తీసుకోండి



రమణయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న 'బాస్' నాయకులు

పీలేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సదుం మండలం నడిగడ్డ పంచాయతీ మాదిగపల్లెకు చెందిన దళిత రైతు రమణయ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీలేరులోని దళిత సంఘాలు నేతలు డిమాండ్ చేశారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రమణయ్య మృతదేహాన్ని బుధవారం వారు సందర్శించారు. అనంతరం విలేఖరులతో వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రమణయ్య, అదే గ్రామానికి చెందిన పవన్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి మధ్య భూవివాదం ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు రమణయ్యకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తన పొలం చదును చేసుకుంటున్న రమణయ్యపై పవన్ కుమార్ రెడ్డి మంగళవారం దాడి చేశాడన్నారు. దీంతో గుండెపోటుకు గురై రమణయ్య పొలంలోనే మరణించాడన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయడంతోపాటు రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతకుమునుపు రమణయ్య మృతదేహాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందర్శించి అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, ఆనంద్ కుమార్, హరినాథ, రెడ్డప్ప, ప్రతాప్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు శ్రీనివాసులు, అనిల్ కుమార్, గంగాధర, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య మృతిపై డీఎస్పీ విచారణ

చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రాంబాబు బుధవారం రమణయ్య మృతిపై విచారణ చేపట్టారు. తొలుత పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రమణయ్య మృతదేహాన్ని పరిశీలించిన ఆయన సంఘటన జరిగిన తీరు గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సదుం పోలీసులతో కేసు పూర్వాపరాలు విచారించారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆయన ప్రజాసంఘాల నాయకులు, రమణయ్య కుటుంబసభ్యులకు తెలియజేశారు.

డీలర్ల నియామక ఇంటర్వ్యూలు వాయిదా

మదనపల్లె టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల డీలర్ల నియామక ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. మూడు రోజులుగా డివిజన్‌లోని ఎనిమిది మండలాలకు చెందిన డీలర్ల నియామక ఇంటర్వ్యూల్లో భాగంగా బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో వాల్మీకిపురం, కలికిరి మండలాలకు చెందిన చౌకదుకాణాలకు సంబంధించి డీలర్ అభ్యర్థులను సబ్‌కలెక్టర్ ఇంటర్వ్యూ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురు, శుక్రవారాల్లో నిర్వహించాల్సిన నిమ్మనపల్లె, మదనపల్లె, రామసముద్రం మండలాలకు చెందిన డీలర్ అభ్యర్థుల ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నామన్నారు. రాయచోటిలో సీఎం పర్యటన ఉండే అవకాశం ఉందని, ఈ ఏర్పాట్లకు సంబంధించి సమయాభావం వలన ఇంటర్వ్యూలు వాయిదా వేస్తున్నామని, తదుపరి ఇంటర్వ్యూ తేదీలను ప్రకటిస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు.

జీవో 108 మేరకు ఆయాలకు జీతాలివ్వాలి

పీలేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లను జీవో నెం.108 మేరకు నెలకు రూ.11,500ల జీతం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన పీలేరు నియోజకవర్గ ఆయాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో ప్రకారం వేతనం చెల్లించడమే కాకుండా వారిని ఆప్కాస్‌లో చేర్చి ఆప్కాస్ ఉద్యోగులతో సమానంగా ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలన్నారు. ఫిబ్రవరి 9వ తేదీన పీలేరులో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఆయాల నాయకురాళ్లు యశోదా, నూర్‌జాన్, రత్నమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మల్లయ్యకొండ మాజీ ఛైర్మన్ ఆర్థిక సాయం

● రూ.50వేలతో హైస్కూలుకు మంచినీటి పైపు లైను ఏర్పాటు

తంబళ్లపల్లె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ మాజీ ఛైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి స్థానిక హైస్కూలులో తన సొంత నిధులతో మంచి నీటి పైపులైన్‌ను వేయించి బుధవారం ప్రారంభించారు. ఈ నెల 2వ తేదీన మద్దిరెడ్డి కుమారుడు గౌతంరెడ్డి జన్మదినం సందర్భంగా వారు చదువుకున్న పాఠశాలకు మంచి నీటి పైపు లైను వేయిస్తానని మద్దిరెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు పాఠశాలలో తన సొంత నిధులు రూ.50వేలతో మంచి నీటి పైపు లైను వేయించి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ శివకుమార్, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి సుబ్రమణ్యం, కురవంక సర్పంచి చలపతి, వైస్ఎంపీపీ కరీం, శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

కలికిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కలికిరి పట్టణానికి చెందిన తల్లీకూతుళ్లు అదృశ్యమైన సంఘటనకు సంబంధించి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసు ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని టీబీ రోడ్డులో కాపురమున్న షేక్ సర్దార్ భార్య మొబుసిరా (22), కుమార్తె జకియా ఫాతీమా (3)లు వారం రోజుల నుంచి కనపడకుండా పోయారని షేక్ సర్దార్ ఫిర్యాదు చేశారు. సర్దార్ ఫిర్యాదుపైన కేసు నమోదు చేసి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

పీలేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు బుధవారం పీలేరు పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 45 వాణిజ్య దుకాణాలు, మటన్, చికెన్ సెంటర్లలోని ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు ఈ నెలాఖరులోగా తూకపు యంత్రాలను తమ వద్ద సర్టిపై చేయించుకోవాలని, అలా చేయించుకోని వారిపై జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

138 పశువులకు వైద్య చికిత్సలు

పెద్దమండ్యం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెద్దమండ్యం పరిధిలోని కోటకాడపల్లి లో బుధవారం జరిగిన పశు ఆరోగ్య శిబిరంలో 138 పశువులకు వైద్యసేవలందించారు. 18 ఆవులకు సూడి పరీక్షలు, 94 పశువులకు బ్యూటాక్స్ పిచికారి చేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ నెల చివరి వరకు జరిగే ఈ పశు వైద్యశిబిరాలును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దమండ్యం పశు వైద్య సహాయకులు రామ్మోహన, గుణశేఖర్, విశ్వనాథ్, మహేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలు పాడి రైతులకు ఆసరాగా నిలుస్తున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన శిబిరంలో 120 పశువులకు, 50 దూడలకు వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, చంద్రమోహన్, త్యాగరాజు, రామాంజు లు, ఏడీ క్రిష్ణయ్య, పూర్ణిమ పాల్గొన్నారు.

రేపు మదనపల్లెలో ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీటీఎం క్రాస్ రోడ్డులో ఈ నెల 31న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఈశ్వరమ్మ, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెంకటరమణ తెలిపారు. సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రిలు సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో షుగర్ వ్యాధి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమౌతుందని మదనపల్లె పట్టణంలో బుధవారం నిర్వహించిన సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు తెలిపారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని పార్టీ నాయకుడు హరిశర్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ స్పష్టమైన ప్రణాళిక, నిర్దిష్టమైన కార్యాచరణ అవసరమని తెలిపారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రత్యామ్నాయ ప్రణాళికపై చర్చించడం జరుగుతుందన్నారు. సదస్సులో సీపీఎం నాయకులు ప్రభాకరెడ్డి, రఘునాథ్, రాజమ్మ, రామకృష్ణ, నాగరాజు, రెడ్డికుమారి, భాగ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

మదనపల్లె అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి):స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో బుధవారం ఆఫీసర్స క్లబ్, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ నాగభూషణరెడ్డి, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ మహమ్మద్ బాషా అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బెంగళూరుకు చెందిన డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌గౌడ్, సురజ్‌లు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రిటైర్డ్ డీఎస్పీ బి. సుభాష్, అగ్రికల్చర్ రిటైర్డ్ ఏడీ శివకుమార్‌రెడ్డి, ఆస్పత్రి డీజీఎం సయ్యద్ జమరుత్ బాషా పాల్గొన్నారు.

సర్వేలు త్వరిగతిన పూర్తి చేయాలి

మదనపల్లె టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సచివాలయ సిబ్బంది త్వరిగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని వలసపల్లె, బసినికొండ, కొత్తిండ్లు గ్రామ సచివాలయాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్, ఇంటింటికి జియో ట్యాగింగ్, కమ్యూనిటి అసెస్ట్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాల కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కరాటే అధ్యక్షుడికి సన్మానం

మదనపల్లె అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ సురేష్‌ను బీసీ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. తన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా వారు కొనియాడారు.